


బుధవారం 26 ఆగస్టు 2026 పేజీలు : 8

## సారంపల్లి మల్లారెడ్డి మృతి కమ్యూనిస్టు, రైతాంగ ఉద్యమానికి తీరని లోటు






# బిల్లుకు బ్రేక్.. రికార్డులు ఎక్కడ?

తీర్మానం, ఎంబీ లేకుండా రూ.63,600 చెల్లింపునకు ప్రయత్నమా? ప్రశ్నించిన ఉప సర్పంచ్ దీపక్

మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉప సర్పంచ్ దీపక్ ముందే

మీడియా ప్రతినిధులకు సరైన జవాబు దారి తనంగా సహకరించని,కార్యదర్శి, సర్పంచ్

ఏదో కాగితాలు చూపిస్తే సంతకం చేశాను:సర్పంచ్ అన్ని ఉన్న రికార్డులను ఇంట్లో పెట్టి వచ్చానంటూ:కార్యదర్శి

## నైపుణ్యంతో డ్రైవింగ్.. బాధ్యతతో విధులు



పోలీస్ డ్రైవర్లకు భద్రత, నైపుణ్యం, సేవా బాధ్యతపై ప్రత్యేక శిక్షణ

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

## చక్కెర ధరలకు రెక్కలు.. సామాన్యులకు చేదు

కిలో రూ.80.. మరో వారం రోజుల్లో రూ.100 దాటేనా!

పరుగులు పెడుతున్న చక్కెర ధరలు..సామాన్యుకు పెరుగుతున్న భారం



# సారంపల్లి మల్లారెడ్డి మృతి కమ్యూనిస్టు, రైతాంగ ఉద్యమానికి తీరని లోటు

## సీపీఐ(ఎం), సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళి

**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజాజ్యోతి):** రైతు సంఘం అఖిల భారత నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి కమ్యూనిస్టు పార్టీకి, రైతాంగ ఉద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఐ(ఎం), సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సారంపల్లి మల్లారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోమాస ప్రకాష్ మాట్లాడుతూ.. మల్లారెడ్డి చిన్నతనం నుంచే ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై గ్రామస్థాయి నుంచి పోరాటాలు నిర్వహించారని తెలిపారు. పార్టీతో పాటు ప్రజా సంఘాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడిగా, అఖిల భారత రైతు సంఘం నాయకుడిగా సేవలందించారని గుర్తుచేశారు. అన్ని అంశాలపై లోతైన అవగాహన కలిగిన మేధావిగా మల్లారెడ్డి గుర్తింపు పొందారని, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులపై పూర్తి అవగాహన కలిగి ఉండేవారని అన్నారు. నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడిగా ఆయన ప్రజా ఉద్యమాలకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. మల్లారెడ్డి



మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, రైతాంగ ఉద్యమానికి తీరని లోటని పేర్కొంటూ.. ఆయన పోరాట స్ఫూర్తితో ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. జిల్లాలో పార్టీ, ప్రజా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్ కుమార్, రజక సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్, సీఐటీయూ నాయకులు రాందాస్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# చక్కెర ధరలకు రెక్కలు.. సామాన్యులకు చేదు

**కిలో రూ.80.. మరో వారం రోజుల్లో రూ.100 దాటేనా!**

**పరుగులు పెడుతున్న చక్కెర ధరలు..సామాన్యుపై పెరుగుతున్న భారం**

**ఆసిఫాబాద్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** చక్కెర ధరలు రోజురోజుకూ పరుగులు పెడుతున్నాయి. ఒకప్పుడు కిలో చక్కెర రూ.40 నుంచి రూ.50లోపే లభించగా, ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో రూ.75 నుంచి రూ.80 వరకు చేరడంతో సామాన్య వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ధరల పెరుగుదల ఇదే స్థాయిలో కొనసాగితే మరో వారం రోజుల్లో కిలో చక్కెర ధర రూ.100కు చేరే అవకాశం ఉందన్న అంచనాలు మార్కెట్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. దీంతో నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న మధ్యతరగతి, పేద కుటుంబాలపై మరింత భారం పడుతోంది.చాయ్, కాఫీ నుంచి స్వీట్లు, పిండి వంటకాల వరకు ప్రతి ఇంట్లోనూ నిత్యం వినియోగించే చక్కెర ధర పెరగడం కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా పండుగల సమయంలో చక్కెర వినియోగం పెరిగే అవకాశం ఉండటంతో రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే పరిస్థితి ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

**గ్లోబల్ కొరత.. పెరుగుతున్న డిమాండ్**

చక్కెర ధరల పెరుగుదలకు అంతర్జాతీయ మార్కెట్‌లో సరఫరా కొరత, ఉత్పత్తిలో మార్పులు, పండుగల సందర్భంగా పెరుగుతున్న డిమాండ్ వంటి కారణాలు ఉన్నాయని కేంద్రం పేర్కొంటోంది. దేశీయ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడం కూడా ధరలపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడం వల్ల కూడా రిటైల్ ధరలు పెరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇథనాల్ ప్రభావం ఎంత?**

చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తి కూడా ఒక కారణమని కొంతమంది మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్ అవసరాలు పెరగడంతో చక్కెర పరిశ్రమలో ఉత్పత్తి అయ్యే చెరకు రసాన్ని, సిరప్‌ను ఇథనాల్ తయారీకి మళ్లించడం జరుగుతోంది. దీంతో చక్కెర ఉత్పత్తి, మార్కెట్‌కు వచ్చే సరఫరాపై ప్రభావం పడే అవకాశం




ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.అయితే చక్కెర ధరల పెరుగుదలకు ఒక్క ఇథనాల్ విధానమే కారణమని చెప్పలేమని, ఉత్పత్తి, నిల్వలు, అంతర్జాతీయ ధరలు, దేశీయ డిమాండ్, సరఫరా పరిస్థితులు వంటి అనేక అంశాలు కలిసి పనిచేస్తాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

**సామాన్యుడిపై అదనపు భారం**

చక్కెర ధరలు పెరగడంతో కేవలం గృహ వినియోగదారులే కాకుండా టీ దుకాణాలు, హోటళ్లు, స్వీట్ షాపులు, బేకరీలు, చిన్నతరహా ఆహార వ్యాపారాలపై కూడా ప్రభావం పడుతోంది. ముడిసరుకు ధర పెరగడంతో వ్యాపారులు తమ ఉత్పత్తుల ధరలను పెంచే పరిస్థితి ఏర్పడితే చివరికి ఆ భారం వినియోగదారుడిపైనే పడే అవకాశం ఉంది.ఇప్పటికే కూరగాయలు, పప్పులు, నూనెలు తదితర నిత్యావసర సరుకుల ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చక్కెర ధరల పెరుగుదల మరింత భారంగా మారుతోంది. ధరలను అదుపులో ఉంచేందుకు మార్కెట్‌లో సరఫరాను పర్యవేక్షించడంతో పాటు అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతకు అడ్డుకట్ట వేయాలని వినియోగదారులు కోరుతున్నారు. తియ్యగా ఉండాల్సిన చక్కెర.. ధరల పెరుగుదలతో సామాన్యుడికి చేదు అనుభవంగా మారుతోంది. రానున్న రోజుల్లో ధరలు ఏ స్థాయికి చేరుతాయో చూడాలి.

## గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

**ఆత్రం సుగుణక్క, ఎమ్మెల్సీ దండే విఠల్**



**బెజ్జూర్ ఆగస్టు25(ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసేందుకు చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ లో భాగంగా మంగళవారం బెజ్జూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షురాలు పంద్రం పుష్పలత అధ్యక్షతన జరిగిన సమావేశానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. మండల, గ్రామ, బూత్ స్థాయిల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఐక్యంగా పనిచేస్తే బెజ్జూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలమైన శక్తిగా ఎదుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు వివిధ గ్రామాల సర్పంచులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో యువతకు ఉద్యోగ అవకాశాలే లక్ష్యం

**రాష్ట్ర మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి**



**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి జపాన్‌లో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఆయన జపాన్‌లోని కిండాయ్ యూనివర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా జపాన్‌లో అమలవుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, పరిశ్రమలు--విద్యాసంస్థల మధ్య కొనసాగుతున్న అనుసంధాన విధానాలను మంత్రి పరిశీలించారు. విద్యార్థులు, యువతలో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్న విధానాలను అధ్యయనం చేశారు. జపాన్‌లోని పరిశ్రమలు, విద్యాసంస్థలతో తెలంగాణకు మరింత సహకారం పెంపొందించే దిశగా ఈ పర్యటన కొనసాగుతోంది. తద్వారా తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆధునిక నైపుణ్యాలను అందించే అవకాశాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. తెలంగాణ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి జపాన్ పర్యటన కొనసాగుతోంది.

## పెన్షనర్ల మహా ధర్నాకు తరలిరావాలి

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దూస కృష్ణ, ప్రధాన కార్యదర్శి జగన్ బెజ్జెంకి**



**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజాజ్యోతి):** పెన్షనర్ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు ఈ నెల 27న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాకు జిల్లా వ్యాప్తంగా పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలి రావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు దూస కృష్ణ, ప్రధాన కార్యదర్శి జగన్ బెజ్జెంకి మంగళవారం కోరారు. పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. వేతన సవరణ సంఘం సిఫార్సుల మేరకు 51 శాతం ఫిట్ మెంట్‌తో అమలు చేయాలని, ఆరోగ్య కార్డుల ద్వారా ఎలాంటి పరిమితులు లేకుండా నగదు రహిత వైద్య చికిత్సలు అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలను వెంటనే ప్రకటించి ఏకమొత్తంగా చెల్లించాలని, పెన్షనర్ల ప్రయోజనాలు, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్ వద్ద జరిగే మహా ధర్నాలో ప్రతి పెన్షనర్ పాల్గొని తమ ఐక్యతను చాటాలని దూస కృష్ణ, జగన్ బెజ్జెంకి కోరారు. పెన్షనర్ల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించి మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కనర్ గాంను గ్రీనరీ జీపీగా తీర్చిదిద్దుతాం

**రోడ్డు పక్కన 2 వేల మొక్కలు నాటుతున్నాం**

**ఉప సర్పంచ్ దుర్గం జీవన్**



**ఆసిఫాబాద్ , ఆగస్టు 25 ప్రజా జ్యోతి** కనర్ గాం గ్రామపంచాయతీని పచ్చదనంతో నింపి గ్రీనరీ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఉప సర్పంచ్ దుర్గం జీవన్ తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారుల వెంబడి సుమారు 2 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, గ్రామస్థులు కూడా మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# పి.డీ.ఎస్.యూ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

### సెప్టెంబర్ 1, 2న నల్లగొండలో రాష్ట్రస్థాయి రాజకీయ విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు



**ఆసిఫాబాద్, ఆగస్టు 25 ప్రజా జ్యోతి** పి.డీ.ఎస్.యూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1, 2 తేదీల్లో నల్లగొండ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రాజకీయ విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం కొమురంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి పిలుపునిచ్చారు. సోమవారం ఆసిఫాబాద్ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. నేటి సమాజంలో మానవీయ విలువలు క్షీణిస్తూ సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అశ్లీల సాహిత్యం, గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలుగా మారకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యను కార్పొరేటీకరణ చేసే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడనాడాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మూసివేసిన పాఠశాలలను కొనసాగించాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాలకు వారిని సన్నద్ధం చేయడమే రాజకీయ శిక్షణ తరగతుల లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తరగతులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.డీ.ఎస్.యూ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు సమీర్, ప్రధాన కార్యదర్శి జగజంపుల తరుణ్, ఉపాధ్యక్షుడు శివశంకర్, కోశాధికారి సిరాజ్, కమిటీ సభ్యులు పరియాజ్ ఖాన్, పులి కిరణ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై దాడిని ఖండిస్తూ యువజన కాంగ్రెస్ నిరసన



### అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

### బీజేపీ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

### విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతాం

**ఆసిఫాబాద్, ఆగస్టు 26 ప్రజా జ్యోతి** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిని ఖండిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో పేపర్ లీకేజీల సమస్య పెరిగిందని విమర్శించారు. తమకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులతో దాడి చేయించడం దారుణమన్నారు. విద్యార్థులపై దాడికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను కాపాడేందుకు యువజన కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజల్లో ఎండగడతామని తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇనుకొండ కమల్‌నాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నితిన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు తారిక్ అహ్మద్, ఆసిఫాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు రాపర్తి మురళి, లింగాపూర్ మండల అధ్యక్షుడు జాదవ్ రమేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎలగల సాయికుమార్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు వినోద్, టౌన్ అధ్యక్షుడు ప్రభాకర్, రెబ్బెన మండల అధ్యక్షుడు పూదరి సాయి, జైనూర్ మండల అధ్యక్షుడు మందాడి లింగు, వాంకిడి ఇన్‌చార్జి మండల యువజన అధ్యక్షుడు ఉప్పల కృష్ణ, నార్నూర్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షేక్ మహమ్మద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండ సాయి, ఎల్లూరి రాము, షేక్ అజీముద్దీన్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిల్లుకు బ్రేక్.. రికార్డులు ఎక్కడ?

**తీర్మానం, ఎంబీ లేకుండా రూ.63,600 చెల్లింపునకు ప్రయత్నమా? ప్రశ్నించిన ఉప సర్పంచ్ దీపక్**

**మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉప సర్పంచ్ దీపక్ ముండే**

**మీడియా ప్రతినిధులకు సరైన జవాబు దారి తనంగా సహకరించని,కార్యదర్శి, సర్పంచ్**

**ఏదో కాగితాలు చూపిస్తే సంతకం చేశాను:సర్పంచ్ అన్ని ఉన్న రికార్డులను ఇంట్లో పెట్టి వచ్చానంటూ:కార్యదర్శి**

**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):** గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో పారదర్శకతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.63,600 చెల్లింపునకు సంబంధించిన ఓ ఫైల్‌పై అవసరమైన రికార్డులు లేకపోవడాన్ని ఉప సర్పంచ్ దీపక్ ప్రశ్నించడంతో ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పంచాయతీ నిధులు ఖర్చు చేసే విషయంలో నిబంధనలు పాటించాల్సిందేనని ఆయన స్పష్టం చేస్తూ బిల్లుపై సంతకం చేయకుండా నిలిపివేసినట్లు సమాచారం.

### ఫైల్ సిద్ధం.. కానీ రికార్డుల సంగతేంటి?

ఆకిని, మండోకార్,వాడ, రాంనగర్ ప్రాంతాల్లో ఇసుక ఫిల్లింగ్ పనులు చేపట్టినట్లు పేర్కొంటూ ఫైల్ నెం.13/2026-27, తేదీ 03-08-2026ను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ పనులకు సంబంధించి రూ.63,600 చెల్లించేందుకు బిల్లు ప్రక్రియ చేపట్టినట్లు తెలుస్తోంది. ఫైల్‌పై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సంతకాలు పూర్తయిన అనంతరం అది ఉప సర్పంచ్ వద్దకు చేరినట్లు సమాచారం. అయితే బిల్లును పరిశీలించిన ఉప సర్పంచ్ దీపక్‌కు కొన్ని అంశాలపై అనుమానాలు తలెత్తినట్లు తెలుస్తోంది. పనులకు గ్రామపంచాయతీ తీర్మానం ఉందా? పనులు చేపట్టేందుకు వర్క్ ఆర్డర్ జారీ చేశారా? అంచనా ఎక్కడ ఉంది? వాస్తవంగా ఎంత పరిమాణంలో పని జరిగింది? దానికి సంబంధించిన ఎంబీ రికార్డు ఎక్కడ ఉంది? అనే ప్రశ్నలను ఆయన లేవనెత్తినట్లు సమాచారం.

### సంతకం అంటే బాధ్యత.. అందుకే వెనక్కి

బిల్లుపై సంతకం చేయడం కేవలం ఒక ప్రక్రియ కాదని, దాని ద్వారా సంబంధిత వ్యక్తులపై బాధ్యత కూడా ఉంటుందని ఉప సర్పంచ్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అందుకే రికార్డులు పూర్తిగా పరిశీలించకుండా సంతకం చేయడానికి ఆయన నిరాకరించినట్లు సమాచారం.రేపు అధికారులు రికార్డులు అడిగితే ఎవరు సమాధానం చెప్పాలి? ప్రజల డబ్బు ఖర్చు చేస్తున్నప్పుడు ప్రతి పనికి లెక్క ఉండాలి. తీర్మానం లేకుండా, ఎంబీ రికార్డు లేకుండా బిల్లుకు ఎలా సంతకం చేయాలి? అంటూ దీపక్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది.తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసినందుకు తనపై రాజకీయంగా విమర్శలు చేయడం, బద్నాం చేసే ప్రయత్నాలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. తనకు వ్యక్తిగత ప్రయోజనం లేదని, పంచాయతీ నిధులు నిబంధనల ప్రకారమే ఖర్చు కావాలన్నదే తన ఉద్దేశమని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

### పని జరిగింది' అంటే సరిపోదు.. ఆధారాలూ ఉండాలి

ప్రభుత్వ నిధులతో చేపట్టే పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలంటే పనులు వాస్తవంగా జరిగాయనే విషయం మాత్రమే కాకుండా, వాటికి సంబంధించిన అధికారిక రికార్డులు కూడా ఉండాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.పనుల అంచనా, అనుమతి, వర్క్ ఆర్డర్, కొలతలు, పూర్తి చేసిన పనుల వివరాలు, బిల్లు తదితర అంశాలు స్పష్టంగా ఉంటే చెల్లింపులపై అనుమానాలకు అవకాశం ఉండదని వారు పేర్కొంటున్నారు. రికార్డులు లేకుండా చెల్లింపులు జరిగితే భవిష్యత్తులో ఆర్థికపరమైన ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### పాత పర్సంటేజీ ఆరోపణలు మళ్లీ తెరపైకి

గ్రామపంచాయతీలో గతంలో బిల్లుల చెల్లింపుల సమయంలో 5 శాతం, 3 శాతం, 2 శాతం పర్సంటేజీల డిమాండ్లు ఉన్నాయని కొందరు కాంట్రాక్టర్లు ఆరోపించినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది. ప్రస్తుత బిల్లుపై ఉప సర్పంచ్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాత ఆరోపణలు మరోసారి చర్చకు వచ్చాయి. పంచాయతీ నిధుల వినియోగంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



### అధికారుల విచారణతోనే అసలు నిజం

ఈ వ్యవహారంపై మండల, జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించి సంబంధిత ఫైల్‌ను పూర్తిగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ తీర్మానాల పుస్తకం, ఎంబీ రికార్డు, వర్క్ ఆర్డర్, అంచనా పత్రాలు, పనుల కొలతలు, బిల్లు వివరాలు, చెల్లింపు ప్రక్రియను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.బిల్లులో పేర్కొన్న పనులు వాస్తవంగా జరిగాయా? జరిగితే ఎంత మేరకు జరిగాయి? రూ.63,600 చెల్లింపునకు ఆధారం ఏమిటి? సంబంధిత రికార్డులు ఎందుకు అందుబాటులో లేవు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అంటున్నారు.

### పారదర్శకత ఉంటే భయమెందుకు?

గ్రామపంచాయతీ నిధులు ప్రజల పన్నులు, ప్రభుత్వ కేటాయింపులతో వచ్చే నిధులని, వాటి వినియోగంపై ప్రజలకు ప్రశ్నించే హక్కు ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రతి బిల్లు పారదర్శకంగా ఉండాలని, పంచాయతీ రికార్డుల్లో అన్ని వివరాలు నమోదు కావాలని వారు కోరుతున్నారు. రికార్డులు సక్రమంగా ఉంటే పరిశీలనకు అభ్యంతరం ఎందుకు? పనులు నిబంధనల ప్రకారం జరిగితే పూర్తి పత్రాలు చూపించాలి. అనుమానాలకు తావులేకుండా వ్యవహరించాలి అని గ్రామస్తులు అంటున్నారు. ఉప సర్పంచ్ దీపక్ బిల్లుపై సంతకం చేయకుండా నిలిపివేసిన అంశాన్ని కొందరు గ్రామస్తులు స్వాగతిస్తున్నారు. అయితే ఇది వ్యక్తిగత విభేదంగా కాకుండా పంచాయతీ ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకతకు సంబంధించిన అంశంగా చూడాలని వారు కోరుతున్నారు.

### సంతకం కాదు.. ముందుగా రికార్డులు

ప్రజా ధనం విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, ప్రతి చెల్లింపుకు ఆధారాలు ఉండేలా చూడాల్సిన బాధ్యత పాలకవర్గం, పంచాయతీ అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రూ.63,600 బిల్లు వ్యవహారంపై ఉన్న అనుమానాలను అధికారులు నివృత్తి చేసి, సంబంధిత రికార్డులను ప్రజల ముందుంచాలని డిమాండ్ పెరుగుతోంది. తీర్మానం ఉందా? ఎంబీ రికార్డు ఉందా? వర్క్ ఆర్డర్ ఉందా? పనుల కొలతలు ఎక్కడ ఉన్నాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు వెలువడినప్పుడే బిల్లు చెల్లింపు వ్యవహారంపై పూర్తి స్పష్టత వస్తుందని స్థానికులు చెబుతున్నారు.

# 12వ జేబీసీసీఐ ఏర్పాటుకు మార్గం సుగమం

**ఈ--1 గ్రేడ్ అధికారుల వేతన వ్యత్యాసం సవరణకు కోల్ ఇండియా కీలక నిర్ణయం**




**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజాజ్యోతి):** కోల్ ఇండియా లిమిటెడ్‌లో 12వ జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ (జేబీసీసీఐ) ఏర్పాటుకు ఉన్న ప్రధాన అవరోధాల్లో ఒకదాన్ని అధిగమించే దిశగా యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డీపీఈ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ--1 గ్రేడ్ అధికారుల మూల వేతనంలో ఉన్న వ్యత్యాసాన్ని సరిచేసేందుకు చర్యలు చేపట్టింది. ఆగస్టు 14న జరిగిన కోల్ ఇండియా డైరెక్టర్ల బోర్డు 493వ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఆగస్టు 17న కార్యాలయ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అర్హత కలిగిన అధికారుల మూల వేతనాన్ని ఒకేసారి సవరించే విధానాన్ని ఉత్తర్వుల్లో తెలిపారు. 2021 జూలై 1న ఈ--1 గ్రేడ్‌లో పనిచేస్తూ, అంతకుముందు ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో కనీసం ఏడాది సేవ పూర్తి చేసి, అదే తేదీన రూ.71,030 కంటే తక్కువ మూల వేతనం పొందుతున్న అధికారుల వేతనాన్ని 2021 జూలై 1 నుంచే రూ.71,040కు పెంచనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అనంతరం అమల్లో ఉన్న పే ఫిక్సేషన్ నిబంధనల ప్రకారం వారి వేతనాన్ని పునర్నిర్ణయించనున్నారు. డీపీఈ మార్గదర్శకాల ప్రకారం అధికారుల వేతనం సంబంధిత ఉద్యోగుల వేతనం కంటే తక్కువగా ఉండకూడదనే సూత్రం ఉంది. 11వ జేబీసీసీఐ అమల్లోకి వచ్చిన అనంతరం కొంతమంది కోల్ ఇండియా అధికారుల వేతనాల్లో ఏర్పడిన వ్యత్యాసంపై అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. తాజా నిర్ణయంతో ఈ వేతన వ్యత్యాసాన్ని సరిచేసేందుకు యాజమాన్యం ముందడుగు వేసింది. దీంతో 12వ జేబీసీసీఐ ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగి, తదుపరి ప్రక్రియ వేగవంతం అవుతుందని కార్మిక వర్గాలు భావిస్తున్నాయి. కోల్ ఇండియాలో కార్మికులు, అధికారులు, యాజమాన్యం మధ్య వేతనాలు, సేవా నిబంధనలు, ఇతర ప్రయోజనాలపై ద్వైపాక్షిక చర్చలకు జేబీసీసీఐ కీలక వేదికగా ఉంది. 12వ జేబీసీసీఐ త్వరగా ఏర్పాటైతే పెండింగ్‌లో ఉన్న పలు అంశాలపై చర్చలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని కార్మిక సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# మండల్ స్ఫూర్తితో నేటి ప్రజలు ఉద్యమించాలి

## మంచిర్యాలలో ఘనంగా బీపీ మండల్ 108 వ జయంతి సభ



**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజాజ్యోతి):** మండల్ కమిషన్ సిఫార్సుల ను అందించి దేశవ్యాప్తంగా బీసీ వర్గాల సంక్షేమానికి పునాదులు వేసిన బిందేశ్వరీ ప్రసాద్ మండల్ అందించిన స్ఫూర్తితో నేటి ప్రజలు ఉద్యమించాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మంచిర్యాల చార్వాక ట్రస్ట్ హాల్లో బీపీ మండల్ 108వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీపీ మండల్ ఎంతో పరిశోధన చేసి అందించిన సిఫార్సుల్లో కేవలం రెండింటినే నేటికీ అమలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఆధిపత్య వర్గాలు బీసీల ఆకాంక్షలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆధిపత్య వర్గాల వివక్షను ఎదుర్కొంటూ బీహార్ ముఖ్యమంత్రిగా కొనసాగిన బీపీ మండల్ దేశానికి కొత్త దిశను చూపారని తెలిపారు. మండల్ రెండో దశ ఉద్యమం నేటి పరిస్థితుల్లో అవసరమని నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన తప్పుల తడకగా కొనసాగుతోందని ఆరోపించారు. తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో జరిగిన విధంగా కులాల వారీగా పట్టిక రూపొందించి, ప్రతి కులానికి నంబర్ కేటాయించి నప్పుడే సమగ్ర కులగణన సాధ్యమవుతుందని తెలిపారు. కులగణన ను పకడ్బందీగా నిర్వహించేలా దేశవ్యాప్తంగా బీసీలు ఉద్యమించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వర గౌడ్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీనియర్ బీసీ నాయకులు మార్కండేయ, రాజేశం గౌడ్, సమ్మ రాజన్న, మొగిలి తిరుపతి, శ్రీనివాస్ గౌడ్, కార్తీక్, లింగమూర్తి, సాయికుమార్, చరణ్, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



**బెజ్జూర్ ఆగస్టు 25(ప్రజా జ్యోతి):** ప్రజలకోసం నిరంతరం అభివృద్ధి కోసం పథకాలు అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.బెజ్జూర్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోనే తెలంగాణా రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు.రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని అన్నారు.రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సన్న బియ్యం, రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇల్లు ,రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేని అన్నారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుంటే కొంతమంది నాయకులు అబద్ధపు మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీని బదనం చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అబద్ధపు మాటలను నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హాకీం, కావిడ నందయ్య, గుర్లె వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్‌తో తిరిగి పొందొచ్చు

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**రూ.27.40 లక్షల విలువైన 142 సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత**




**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజాజ్యోతి):** సెల్‌ఫోన్ పోయినా, దొంగి లించబడినా బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమో దు చేసి, సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం నిర్వహించిన సెల్‌ఫోన్ రికవరీ మేళాలో రూ.27.40 లక్షల విలువైన 142 సెల్‌ఫోన్లను వాటి యజమానులకు సీపీ చేతుల మీదుగా అందజేశారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో సీసీఎస్, ఐటీ సెల్ బృందాలు ప్రత్యేకంగా కృషి చేసి ఈ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నాయి. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ల రికవరీ కోసం సీసీఎస్‌తోపాటు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 10,420 మంది సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదులు నమోదు చేయగా, 3,717 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని యజమానులకు అందజేశారని వెల్లడించారు. తాజాగా సీసీఎస్, ఐటీ సెల్ పోలీసులు ప్రత్యేకంగా శ్రమించి మరో 142 సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ పోగొట్టుకున్న, దొంగిలించబడిన మొబైల్‌ఫోన్లను గుర్తించేందుకు సీఈఐఆర్ పోర్టల్‌ను అందుబాటు లోకి తీసుకొచ్చిందని సీపీ వివరించారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ సమాచార సేకరణ, నగదు చెల్లింపులు, ఆన్‌లైన్ దరఖాస్తులు తదితర అవసరాలకు అ త్యంత కీలకంగా మారిందన్నారు. ఎవరైనా మొబైల్‌ఫోన్‌ను పోగొట్టు కున్నా లేదా దొంగిలించబడినా ఆలస్యం చేయకుండా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్‌ను బ్లాక్ చేయడంతోపాటు సంబంధిత పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పోర్టల్‌లో నమోదు చేసిన వివ రాల ఆధారంగా ఫోన్‌ను ఇతర రాష్ట్రాల్లో లేదా ఇతర నెట్‌వర్క్‌లలో ఉపయోగించకుండా నిరోధించే అవకాశం ఉంటుందని తెలిపారు. సీఈఐఆర్ విధానం ద్వారా మొబైల్‌ఫోన్ చోరీలను నియంత్రించడం తోపాటు పోగొట్టుకున్న, దొంగిలించబడిన ఫోన్లను తిరిగి గుర్తించి యజమానులకు అందించే అవకాశం పెరుగుతుందని సీపీ వివరిం చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్, వై. కృష్ణారెడ్డి, టి. గోపి, పి. బాలాజీ వరప్రసాద్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, ఎస్ఐలు బి. జీవన్, ఎం. చంద్రశేఖర్, ఎం.ఏ. నసీర్, ఎం. శివకేశ వులు, కె. భాస్కర్ రావు, బి. భూమన్న, బి. శిరీష, శెట్టి లలితతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూసేకరణలో పరిహారం చెల్లింపు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలి

**రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా చేపట్టిన భూసేకరణలో పరిహారం చెల్లింపు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, ఆహార--పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూసేకరణ, పునరావాసం--పునరావాస పునరుద్ధరణ, అటవీ అనుమతులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూసేకరణ పరిహారం చెల్లింపులకు సంబంధించి అమలులో ఉన్న నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హతలను పరిశీలించి జిల్లాల వారీగా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. అర్హత కలిగిన భూ నిర్వాసితులు, భూ యజమానులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపులను వేగంగా పూర్తి చేయాలని, ఇంజనీర్లు సంబంధిత శాఖల సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పరిహారం చెల్లింపుల కోసం సుమారు రూ.6 వేల కోట్ల నిధులను విడుదల చేయనున్నందున, అర్హత కలిగిన కేసులను గుర్తించి అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పరిహారం కేసుకు టోకెన్ నంబర్ జనరేట్ చేసి చెల్లింపుల ప్రక్రియను పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. పరిహారం చెల్లింపులు, అర్హత నిర్ధారణ లేదా ఇతర సాంకేతిక, పరిపాలనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులు ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించి వెంటనే పరిష్కరించుకోవాలని మంత్రి తెలిపారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టి, పి.డి. ఖాతాలో ఉన్న నిధులను వెంటనే భూ యజమానులకు చెల్లించాలని సూచించారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను నిర్దేశిత కాలవ్యవధిలో పరిష్కరించి అభివృద్ధి ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాల వారీగా భూసేకరణ పురోగతి, పరిహారం చెల్లింపులు, ఆర్అండ్ఆర్ చర్యలు, అటవీ భూములకు సంబంధించిన అనుమతులు, పెండింగ్ సమస్యలపై ఈ సందర్భంగా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంలో భాగంగా సేకరించిన భూముల యజమానులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించడంతో పాటు అటవీ శాఖకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, భూసేకరణ, నీటిపారుదల శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగింపు

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య



**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజాజ్యోతి):**జాతీయ ఆదాయ ఆధారిత ప్రతిభా ఉపకార వేతన పథకం కింద 2026--27 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న పరీక్షకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని మోడల్ పాఠశాలల్లో 2026--27 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 1వ తేదీలోగా ఆన్‌లైన్‌లో బీఎస్ఈ తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సెప్టెంబర్ 3వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తుల హార్డ్ కాపీలను జిల్లా విద్యాధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఎక్కువ మంది అర్హత కలిగిన విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు . దరఖాస్తు రుసుము గా జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.50 ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య కోరారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు పీటీజీ విద్యార్థులు ఎంపిక

**ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్ పీటీజీ గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థులు 12వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఎల్. సిద్ధు 1000 మీటర్ల పరుగు, రాథోడ్ అర్జున్ 400 మీటర్ల పరుగు, చరణ్ కుమార్ షాట్‌పుట్, అంజన్న 600 మీటర్ల పరుగు, జావెలిన్ త్రో విభాగాల్లో పాల్గొననున్నారు. ఈ పోటీలు ఈ నెల 26, 27 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో పాండిచ్చేరిలో పాల్గొనే అవకాశం ఉంటుంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్



సుజాత, వైస్ ప్రిన్సిపాల్ గణేష్, పీడీ, పీఈటీలు హైదర్, సారంగపాణి, సత్యనారాయణతో పాటు అధ్యాపక, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# నైపుణ్యంతో డ్రైవింగ్.. బాధ్యతతో విధులు

## పోలీస్ డ్రైవర్లకు భద్రత, నైపుణ్యం, సేవా బాధ్యతపై ప్రత్యేక శిక్షణ

## రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజా జ్యోతి):** పోలీస్ వాహనాలను నడిపే డ్రైవర్లు మరింత నైపుణ్యం, అప్రమత్తత, బాధ్యతతో విధులు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఆయన ఆదేశాల మేరకు "నైపుణ్యంతో వాహనం నడపాలి – బాధ్యతతో విధులు నిర్వహించాలి" అనే నినాదంతో పోలీస్ డ్రైవర్లకు భద్రత, నైపుణ్యం, సేవా బాధ్యతపై ఒకరోజు ప్రత్యేక పునశ్చరణ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి సీపీ అంబర్ కిషోర్ ఝా హాజరై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. డ్రైవర్లు శారీరక దృఢత్వం, అప్రమత్తత, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని అన్నారు. డ్రైవర్‌పై అధికారులు, సిబ్బంది, ప్రజల భద్రత ఆధారపడి ఉంటుందని, ఒత్తిడి, భయం, కోపం లేదా అనారోగ్య పరిస్థితుల్లో వాహనం నడపకూడదని స్పష్టం చేశారు. పోలీస్ వాహనాన్ని సొంత వాహనంలా భావించి దాని పరిశుభ్రత, నిర్వహణ, సాంకేతిక స్థితిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వాహనం శుభ్రంగా, క్రమబద్ధంగా ఉండటం డ్రైవర్ క్రమశిక్షణకు ప్రతిబింబమని తెలిపారు. విధి నిర్వహణలో మాటపై నియంత్రణ, గోప్యత, సత్ప్రవర్తన పాటించాలని, వాహనంలో జరిగే అధికారిక విషయాలను బయటకు వెల్లడించరాదని సూచించారు. పోలీస్ వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ వేగాన్ని నియంత్రించుకోవాలని, అప్రమత్తంగా వాహనాలు నడపాలని సీపీ సూచించారు. వాహనాల నిర్వహణపై పూర్తి అవగాహనతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించేలా డ్రైవర్లకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ విధుల్లో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న సీపీ.. అధికారులు, సిబ్బందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంతోపాటు అత్యవసర సమయాల్లో వేగంగా, సమర్థవంతంగా స్పందించాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉంటుందని అన్నారు. ప్రతి ప్రయాణంలో భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ నైపుణ్యం, అప్రమత్తత, పూర్తి బాధ్యతతో వాహనాలు నడపాలని సూచించారు. డ్రైవర్ల సంక్షేమం, వైద్య సదుపాయాలు, ఇతర అవసరాల కోసం శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని సీపీ తెలిపారు. మంచి డ్రైవింగ్, క్రమశిక్షణతో పోలీస్ శాఖకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. వీఐపీ కాన్వాయ్‌లో అత్యంత అప్రమత్తతతో వాహనం నడిపి ప్రమాదాన్ని నివారించిన డ్రైవర్ శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా సీపీ అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, రమేష్, ఆర్ఐ ఎంటీఓ మల్లేశం, రమేష్, ఆర్ఎస్ఐ సరిత, సీసీ సందీప్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, డ్రైవర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటీఐలో మూడవ దశ ప్రవేశాలకు దరఖాస్తులు

**జన్నారం,ఆగస్ట్25(ప్రజాజ్యోతి)**ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలు, ఏటీసీల్లో 3వ దశ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు జన్నారం ప్రభుత్వ ఐటీఐ,ఏటీసీ కళాశాల ప్రిన్సిపల్ వై. రమేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత రెండు దశల్లో దరఖాస్తు చేసుకుని సీటు రాని విద్యార్థులు నేరుగా వాక్-ఇన్ ప్రవేశాలకు హాజరు కావచ్చన్నారు. మిగతా వివరాలకు జన్నారం ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీ కళాశాలలో సంప్రదించాలన్నారు. మూడో దశ అడ్మిషన్ల పై అవగాహనలో భాగంగా ప్రిన్సిపాల్ రమేష్ అధ్యాపకులతో కలిసి రాంపూర్, సింగరాయపేట గ్రామాల్లో పర్యటించి విద్యార్థులకు, గ్రామస్తులకు సాంకేతిక విద్య పై అవగాహన కల్పించి సాంకేతిక విద్యతో మంచి భవిష్యత్తు ఉంటుందని వారికి వివరించారు.కావున అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

**సరండి గ్రామపంచాయతీ 4వ వార్డు సభ్యురాలి చొరవ.. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందడుగు**




**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):**ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ 4వ వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు వార్డు సభ్యురాలు మహేశ్వరి పేర్కొంటున్నారు. వార్డు పరిధిలోని ప్రజలను నేరుగా కలిసి వారి ఇబ్బందులను తెలుసుకోవడంతో పాటు, పరిష్కరించాల్సిన సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వార్డులో ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర సమస్యలపై ప్రజల నుంచి వివరాలు సేకరిస్తూ వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నట్లు సమాచారం. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వినడం ద్వారా వార్డు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె భావిస్తున్నారు. ప్రజల సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వార్డు ప్రజల సహకారంతో అభివృద్ధి పనులకు బాటలు వేయడంతో పాటు, మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి**

వార్డు అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మహేశ్వరి చెబుతున్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇస్తూ వార్డును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇకపై కూడా వార్డు ప్రజలతో నిరంతరం మమేకమై, సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటే 4వ వార్డులో మరిన్ని అభివృద్ధి పనులకు మార్గం సుగమం అవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నారు మోసి.. నాట్లు వేసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు.



జన్నారం,ఆగస్ట్25(ప్రజాజ్యోతి)విద్యార్థులకు చదువుతోపాటు వ్యవ సాయం పైన కూడా విద్యార్థులకు క్షేత్రస్థాయిలో తెలియపరచ డానికి పొనకల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.పొనకల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ ఉపాధ్యాయ బృందంతో కలిసి మంగళవారం రోజున పొనకల్ శివారులోని వ్యవసాయ క్షేత్రం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పంటల సాగు విధానం, విత్తనాలు, నీటి వినియోగం, నేల ప్రాముఖ్యత, రైతుల శ్రమ తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతేకాకుండా స్వయం గా నారు మోసి, నాట్లు వేశారు.పుస్తకాల్లో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో చూసి తెలుసుకోవడంతో విద్యార్థుల్లో ఆసక్తి, ప్రశ్నించే తత్వం, పరిశీలనా నైపుణ్యాలు ఈ సందర్భంగా ఉపాధ్యా యులు తెలిపారు. అనుభవంతో నేర్చుకున్న విషయాల ద్వారా విద్యార్థుల అభ్యసనం ఫలప్రదం అవుతుందని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె రాజేశం తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కస్తూరి శ్రీకాంత్, వనిత, సుజాత,విద్యార్థులు పలువురు రైతులు పాల్గొన్నారు...


## పంచాయతీ కార్మికుడు ఆనందరావు మృతి

### అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సాయం



కేరమెరి ఆగష్టు 25 ప్రజా జ్యోతి మండలంలోని ఇందాపూర్ గ్రామపంచాయతీలో వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న దుర్గం ఆనందరావు ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ దుర్గం బుచ్చయ్య, ఉప సర్పంచ్ మోహర్లే మోహన్, పంచాయతీ కార్యదర్శి బి.రాజు ఆనందరావు స్వగృహానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బుచ్చయ్య మాట్లాడుతూ.. ఆనందరావు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోండుగూడ సర్పంచ్ కొట్నాక యాదవ్, మండల పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, వివిధ గ్రామపంచా యతీల కార్మికులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# సంతకానికి ముందు.. రికార్డులే ముఖ్యం!





### రూ.63,600 బిల్లుకు ఉప సర్పంచ్ దీపక్ బ్రేక్.. ఆధారాలు లేకుండా సంతకం చేయనంటూ స్పష్టం

ఆసిఫాబాద్ అర్బీ, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి): గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో నిబంధనలు, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలంటూ వాంకిడి మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ దీపక్ ముందే తీసుకున్న నిర్ణయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.63,600 చెల్లింపునకు సంబంధించిన బిల్లుపై సంతకం చేసే ముందు సంబంధిత రికార్డులను పరిశీలించాలని ఆయన పట్టుబట్టినట్లు సమాచారం.పదవిలో ఉన్నవారు ఏ ఫైల్ వచ్చినా సంతకం చేయడం కాకుండా.. ఆ బిల్లుకు సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించాల్సి న బాధ్యత ఉందనే వైఖరిని దీపక్ ప్రదర్శించారని స్థానికులు అంటున్నారు. ప్రజాధనం విషయంలో తొందరపడకుండా, రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అని ప్రశ్నించడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.

**ముందు రికార్డులు చూపించండి.. ఆ తర్వాతే సంతకం**

ఆకిని, మండోకార్, వాడ, రాంనగర్ ప్రాంతాల్లో ఇసుక ఫిల్లింగ్ పనులకు సంబంధించిన ఫైల్ నెం.13/గ్రాపా/2026-27, తేదీ 03-08-2026 ఆధారంగా రూ.63,600 చెల్లింపునకు ప్రక్రియ చేపట్టినట్లు సమాచారం. ఫైల్ తన వద్దకు వచ్చిన సమయంలో దీపక్ పలు అంశాలపై వివరాలు కోరినట్లు తెలుస్తోంది. గ్రామపంచాయతీ తీర్మానం ఉందా? వర్క్ఆర్డర్ ఎక్కడుంది? అంచనా పత్రాలు ఉన్నా యా? పనుల కొలతలు ఎవరు నమోదు చేశారు? ఎంబీ రికార్డు ఎక్కడుంది? అనే ప్రశ్నలను ఆయన లేవనెత్తినట్లు సమాచారం.

**పదవి కోసం కాదు.. ప్రజాధనం కోసం ప్రశ్నలు**

ఉప సర్పంచ్‌గా తనకు వచ్చిన ఫైల్‌పై కేవలం సంతకం చేయకుండా, అందులోని వివరాలను పరిశీలించాలనే పట్టుదల చూపడం పట్ల స్థానికంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. రేపు ఆడిట్‌లో ప్రశ్నలు వస్తే సమాధానం ఎవరు చెప్పాలి? ప్రజల డబ్బు కాబట్టి ప్రతి చెల్లింపుకూ ఆధారం ఉండాలి" అనే ధోరణితో దీపక్ వ్యవహరించినట్లు తెలుస్తోంది. తనపై ఎలాంటి వ్యక్తిగత ఆరోపణలు వచ్చినా వెనక్కి తగ్గకుండా, రికార్డులు స్పష్టంగా ఉంటేనే సంతకం చేస్తాననే వైఖరి ప్రజా ప్రతినిధిగా ఆయన బాధ్యతను ప్రతిబింబిస్తోందని కొందరు గ్రామస్తులు అంటున్నారు.

**సర్పంచ్, కార్యదర్శి సమాధానాలపై సందేహాలు**

బిల్లు వ్యవహారంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించిన సమయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి నుంచి వచ్చిన సమాధానాలపై కూడా చర్చ జరుగుతోంది.ఏదో కాగితాలు చూపిస్తే సంతకం చేశాను అని సర్పంచ్ చెప్పినట్లు సమాచారం. మరోవైపు అన్ని రికార్డులు ఇంట్లో పెట్టి వచ్చాను అని కార్యదర్శి పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పంచాయతీకి సంబంధించిన ముఖ్యమైన రికార్డులు ఎక్కడ ఉన్నాయి? వాటిని పరిశీలనకు ఎందుకు అందుబాటులో ఉంచలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**ఒక్క సంతకంతో బాధ్యత తప్పదు**

బిల్లుపై సంతకం చేయడం ఒక సాధారణ ప్రక్రియ కాదని, ఆ సంతకంతో ఆ చెల్లింపు ప్రక్రియలో బాధ్యత కూడా వస్తుందని దీపక్ భావించినట్లు తెలుస్తోంది. అందుకే ఎవరెన్ని ఒత్తిళ్లు తెచ్చినా రికార్డులు పరిశీలించకుండా సంతకం చేయకుండా నిలబడటం ద్వారా తన వైఖరిని స్పష్టం చేశారని స్థానికులు చెబుతున్నారు. ప్రజాధనం విషయంలో ఇలాంటి జాగ్రత్త ప్రతి ప్రజాప్రతినిధిలో ఉండాలని, దీపక్ మాదిరిగా ప్రతి బిల్లును ప్రశ్నించి పరిశీలించి నప్పుడే పంచాయతీ పాలనలో పారదర్శకత పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అభినందిస్తున్న గ్రామస్తులు.

**బిల్లు ఆపడం కోసం బిల్లు ఆపలేదు..**

ముందు ఆధారాలు కావాలన్నారు. ఇది మంచి పరిణామం అంటూ కొందరు గ్రామస్తులు ఉప సర్పంచ్‌ను అభినందిస్తున్నారు. ప్రజల డబ్బు ఖర్చవుతున్నప్పుడు ఎవరు ప్రశ్నించినా సమాధానం చెప్పాల్సిందేనని, ప్రశ్నించే ప్రజాప్రతినిధులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు. రికార్డులు ఉంటే చూపించం డి.. బిల్లుకు సంబంధించిన తీర్మానం, వర్క్ఆర్డర్, అంచనా, ఎంబీ రికార్డు, పనుల కొలతలు, పూర్తి వివరాలు అందుబాటులో ఉంటే వాటిని అధికారికంగా పరిశీలనకు ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు. రికార్డులు సక్రమంగా ఉంటే ఉప సర్పంచ్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో ఇబ్బంది ఉండకూడదని వారు అంటున్నారు. రూ.63,600 బిల్లు వ్యవహారంపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావా లని డిమాండ్ చేస్తున్నారు.ప్రజాధనం విషయంలో ప్రశ్నించినందుకు విమర్శలు కాదు.. బాధ్యతగా నిలిచిన ఉప సర్పంచ్ దీపక్‌కు అండగా నిలవాలి అనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతోంది.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: ఎంపీడీవో జ్యోత్స్న

**పచ్చని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: ఖమనా సర్పంచ్ సునీత**



ఆసిఫాబాద్ ఆగష్టు 25 ప్రజా జ్యోతి పర్యావరణ పరిరక్షణ, గ్రామం లో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ఖమన గ్రామ పంచా యతీలో మంగళవారం సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీడీవో పాటిల్ జ్యోత్స్న, సర్పంచ్ సునీత పాల్గొని పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామ ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎంపీడీవో పాటిల్ జ్యోత్స్న మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్క పౌరుడి ప్రాథమిక బాధ్యత అని ఉద్ఘాటించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి విస్తృతంగా మొక్కలు నాటడం ఒక్కటే సరైన మార్గమని చెప్పారు.అనంతరం సర్పంచ్ సునీత మాట్లాడుతూ... గ్రామ పంచాయతీని పచ్చని నందనవనంగా, కాలుష్య రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా, నాటిన ప్రతి ఒక్క మొక్కను సంరక్షించే బాధ్యతను గ్రామస్తు లందరూ స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. పచ్చదనం పెంపుతో గ్రామంలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, మంచి పర్యావరణాన్ని కానుకగా ఇవ్వవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాహు కుమార్, ఏపీవో శ్రవణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వీలాష్, వార్డు సభ్యురాలు సంగీత, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు విశేషంగా పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి ఎస్సై ఉదయ్ కిరణ్

**జన్నారం,ఆగస్ట్25(ప్రజాజ్యోతి)** ఇటీవల తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖలో పోలీస్ కానిస్టేబుల్, మరియు ఎస్సై పోస్టుల భర్తీకి సంబంధించిన నియామక ప్రక్రియను చేపట్టిన నేపథ్యంలో రామగుండం కమిషనరేట్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణ కార్యక్రమాన్ని పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై ఉదయ్ కిరణ్ సూచించారు. జన్నారం మండలంలోని ఇందనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నాయకపు గూడెం యువతీ, యువకులకు ఉచిత పోలీసు ఉద్యోగ శిక్షణ కార్యక్రమం పై మంగళవారం రోజున ఎస్.ఐ ఉదయ్ కిరణ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన మార్గదర్శకత్వం, శిక్షణ మరియు ఆర్థిక పరిస్థితుల కారణంగా పోటీ పరీక్షలకు సిద్ధం కాలేకపోతున్న యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పోలీస్ ఉద్యోగాలకు సంబంధించిన అర్హతలు, ఎంపిక విధానం, రాత పరీక్ష శారీరక దారుఢ్య పరీక్ష తదితర అంశాలపై అభ్యర్థులు ముందుగానే అవగాహన పెంచుకొని ఒక క్రమశిక్షణతో ప్రణాళిక బద్ధంగా పోలీస్ ఉద్యోగాలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా చదువుతోపాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ ఎంపికలో మంచి ఫలితాలు



సాధించవచ్చు అని తెలిపారు. మారుమూల గ్రామాలకు చెందిన యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి పోలీసు ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో రామగుండం కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అర్హులైన యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సమీప పోలీస్ స్టేషన్లో సంప్రదించి సంబంధిత దరఖాస్తు ఫారాన్ని తీసుకొని వివరాలను పూర్తి చేసి పోలీస్ అధికారులకు అందజేయాలని కోరారు. గ్రామీణ ప్రాంత యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పోలీసు శాఖ అందిస్తున్న ఈ ఉచిత శిక్షణ ద్వారా ఎక్కువ మంది యువత పోలీసు ఉద్యోగాల ఎంపికై కుటుంబాలతో పాటు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# మహాధర్నాకు ఉద్యోగుల సమరభేరి

### సమస్యల పరిష్కారం కోసం 27న నస్పూర్‌లో భారీ ఆందోళన

### వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వైద్య, పోలీస్ శాఖల కార్యాలయాల ఉద్యోగులతో సమావేశాలు





**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజాజ్యోతి):** ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 27న నస్పూర్ ఐడీఓసీ వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు ఉద్యోగులు భారీగా తరలిరానున్నారు. సుమారు 3 వేల మంది ఉద్యోగులు పాల్గొనేలా సంఘాల నాయకులు విస్తృతంగా సన్నాహాలు చేస్తున్నారు. మహాధర్నాను విజయవంతం చేసేందుకు టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో మంగళవారం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వైద్య, పోలీస్ శాఖల కార్యాలయాలను సందర్శించి ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులతో సమావేశమై మహాధర్నా ఉద్దేశాన్ని వివరించారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో మహాధర్నాకు తరలివచ్చి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని గడియారం శ్రీహరి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని టీజీఈజేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా పీఆర్‌సీని అమలు చేయడం, 6 డీఏలను చెల్లించడం, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయడం, ఈహెచ్‌ఎస్‌ను సంపూర్ణంగా అమలు చేయడం, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 17 శాతం హెచ్‌ఆర్‌ఏ అమలు చేయడం, ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయడం తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు ఒక్కొక్కరివిగా కాకుండా సమష్టిగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని గడియారం శ్రీహరి అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న నస్పూర్ ఐడీఓసీ వద్ద జరిగే మహాధర్నాకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మహాధర్నాకు సుమారు 3 వేల మంది ఉద్యోగులను సమీకరించేలా ఇప్పటికే వివిధ సంఘాల నాయకులు కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వైద్య, పోలీస్ శాఖల కార్యాలయాల్లో ఉద్యోగులను కలిసి మహాధర్నాకు తరలివచ్చేలా అవగాహన కల్పిస్తున్నారు. ఈ సన్నాహక సమావేశాల్లో టీజీఈజేఏసీ జిల్లా సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి, కో-చైర్మన్ పొన్న మల్లయ్య, డిప్యూటీ చైర్మన్ బొడ్డ శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ నాగుల గోపాల్, ఫైనాన్షియల్ సెక్రటరీ సతీష్ కుమార్‌తో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళా వార్డు సభ్యుల స్థానంలో భర్తల పెత్తనం తగదు.




**జన్నారం,ఆగస్ట్25 (ప్రజా జ్యోతి)** పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మహిళా వార్డు సభ్యుల స్థానంలో వారి భర్తలు పెత్తనం చలాయిస్తున్నారని పొనకల్ గ్రామ 11వ వార్డు సభ్యుడు ముదుగు ప్రవీణ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తే ఆప్రాతినిధ్యాన్ని వారి భర్తలు వినియోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తి కి విరుద్ధమని, ఎన్నికైన మహిళా వార్డు సభ్యులే ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని తమ వార్డుకు సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. గ్రామపంచాయతీ కార్యక్రమాల్లో ప్రజలచే ఎన్నికైన ప్రతి వార్డు సభ్యుడికి సమాన గౌరవము, ప్రాధాన్యత ఉండాలని ,మహిళా సభ్యుల స్థానంలో వారి భర్తలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితికి స్వస్తి పలకాలని, ఇట్టి విషయంపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కెపాసిటర్ బ్యాంకులతో వోల్టేజీకి బలం

### విద్యుత్ నష్టాలకు కళ్లెం..

### అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం తగ్గింపు




**ఆసిఫాబాద్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 11 కేవీ ఫీడర్లలో కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేసినట్లు కుమురంభీం ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్ఈ ఉత్తమ్ జాడె తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో 2 ఎంవీఏఆర్, 11 కేవీ ఫీడర్లలో 1 ఎంవీఏఆర్ సామర్థ్యం కలిగిన కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో చేపట్టిన ఈ చర్యలతో మోటార్ల వల్ల ఏర్పడే రియాక్టివ్ పవర్ డిమాండ్‌ను నియంత్రించడంతోపాటు పవర్ ఫ్యాక్టర్ మెరుగుపడిందన్నారు. ఫలితంగా సాంకేతిక విద్యుత్ నష్టాలు తగ్గాయని తెలిపారు. పిటిఆర్‌లపై భారం తగ్గడంతో పలు ప్రాంతాల్లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు అవసరం కూడా తగ్గుతోందన్నారు. ముఖ్యంగా ఫీడర్ల చివరి ప్రాంతాల్లో వోల్టేజీ స్థాయి మెరుగుపడి రైతుల వ్యవసాయ పంపుసెట్లతోపాటు ఇతర వినియోగదారులకు స్థిరమైన విద్యుత్ అందుతోందని చెప్పారు. అగ్రికల్చర్ ఫీడర్లలో సమస్యలు తలెత్తకుండా కెపాసిటర్ బ్యాంకులు, వోల్టేజ్ బూస్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఈ వివరించారు.

## బీసీ రిజర్వేషన్ల పితామహుడు బి.పి. మండల్‌కు ఘన నివాళులు



**ఆసిఫాబాద్, ఆగస్టు 25 ప్రజా జ్యోతి** బీసీ రిజర్వేషన్ల పితామహుడు, సామాజిక న్యాయ సాధన కోసం కృషి చేసిన బి.పి. మండల్ జయంతిని పురస్కరించుకుని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూపునార్ రమేష్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల్ కమిషన్ ద్వారా వెనుకబడిన వర్గాల సమస్యలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చిన ఘనత బి.పి. మండల్‌దేనన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ల సిఫార్సు సామాజిక న్యాయంలో కీలక మైలురాయిగా నిలిచిందన్నారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా కల్పించేందుకు సమగ్ర కులగణన అవసరమన్నారు. బీసీల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో మారుతి పటేల్, మామిడి కిరణ్, బొట్టుపల్లి ప్రశాంత్, సిరికొండ సాయి కృష్ణ, షేక్ అసద్, చూనార్కర్ వసంతరావు, ఇగరపు సంతోష్, మాటూరి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు

## కుంటాల రిసార్ట్స్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 25, (ప్రజా జ్యోతి )** కుంటాల రిసార్ట్స్ నులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు.ఆదిలాబాద్ జిల్లా నేరడి గొండ మండలంలోని జలపా తానికి సమీపంలో రూ. 3.5 కోట్ల వ్యయంతో చేపట్టిన కుంటాల రిసార్ట్స్ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా మంగళవారం పరిశీలించారు. ఈ పర్యటనలో పనుల ప్రగతిని సమీక్షించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, రిసార్ట్స్ ప్రాంగణంలో పర్యాటకులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు, అదనపు సౌకర్యాలపై తక్షణమే ప్రతి పాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. బోటింగ్ పాయింట్ వద్ద పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, భద్రతా ప్రమాణాల పై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రిసార్ట్ ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటి నీరు పోశారు. ఈ పర్యటనలో టూరి జం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ ఇంజనీర్ ఆంజనేయులు, జిల్లా టూరిజం అధికారి రవి కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి తానాజీ, డిఆర్డీఓ రవీందర్, ఇతర అ ధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చిలాటిగూడలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఆసిఫాబాద్, ఆగస్టు 25 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలంలోని చిలాటిగూడ గ్రామపంచాయతీ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎకంకర్ వినోద్ ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవీందర్, బోయ హేమాజీ, ఏవులే దారుంబాయి, ఏవులే రావు, జి.బోయిరే బాబురావు, బోయిరే వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కుప్టి బ్రిడ్జిపై గుంత ప్రత్యక్షం:

**--భయం భయందోళనలో వాహనదారులు స్తంభించిన ట్రాఫిక్**



**నేరడిగొండ ఆగస్ట్ 25 (ప్రజాజ్యోతి ):**మండలంలోని కుప్టి గ్రామ సమీపాన జాతీయ రహదారిపై ఉన్న పెద్ద బ్రిడ్జిపై ఒక్కసారిగా భారీ గుంత ఏర్పడడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది అకస్మాత్తుగా బ్రిడ్జి మధ్యభాగంలో గుంత ఏర్పడటంతో అటుగా ప్రయాణిస్తున్న వాహనదారులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎలాంటి పెద్ద ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. గుంత ఏర్పడిన కారణంగా బ్రిడ్జిపై ఉన్న రెండు దారుల్లో వాహనాల రాకపోకలను ఒకే దారికి పరిమితం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇరువైపులా వాహనాలు నెమ్మదిగా సాగుతూ తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ముఖ్యంగా సాయంత్రం వేళ వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఇంత పెద్ద బ్రిడ్జిపై గుంత ఎలా ఏర్పడింది....?**

జాతీయ రహదారిపై, అదీ భారీ బ్రిడ్జి మధ్యలో ఇంత పెద్ద గుంత ఏర్పడటంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ నాణ్యతలో లోపమా..? నిర్వహణలో నిర్లక్ష్యమా...? లేక ఇతర సాంకేతిక కారణాలా....? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతటి కీలకమైన బ్రిడ్జిపై ఒక్కసారిగా గుంత ఏర్పడటం అధికారుల పర్యవేక్షణపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతోంది.భారీ వాహనాలు, ప్రయాణికుల వాహనాలు నిత్యం రాకపోకలు సాగించే ఈ బ్రిడ్జిపై గుంత ఏర్పడటంతో ప్రమాద ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వెంటనే మరమ్మతులు చేపట్టాలి**

గుంతను తాత్కాలికంగా పూడ్చడమే కాకుండా, బ్రిడ్జి మొత్తం నిర్మాణ స్థితిని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా నాణ్యతా ప్రమాణాలను పరీక్షించి, అవసరమైన శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఇప్పటికైనా సంబంధిత జాతీయ రహదారి అధికారులు స్పందించి, కుప్టి పెద్ద బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గుంతకు కారణాలను గుర్తించి, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి వాహనాల రాకపోకలను సురక్షితంగా పునరుద్ధరించాలనే డిమాండ్ వినిపిస్తోంది. లేకపోతే చిన్న నిర్లక్ష్యమే భవిష్యత్తులో పెను విషాదానికి దారితీసే ప్రమాదం ఉందని వాహనదారులు మాట్లాడుతున్నారు.

## ఈనెల 31 లోగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి సర్పంచ్ సుష్మ భూమేష్



**జన్నారం,ఆగస్ట్25(ప్రజాజ్యోతి)** అర్హులైన వారు ఈనెల 31 లోపు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సుష్మ భూమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవసరమైన ధ్రువపత్రాలతో ఈ నెల 31లోగా సమర్పించాలన్నారు.దరఖాస్తు ఈ నెల 31 చివరి తేదీ అని కావున అర్హులైన వారు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించగలరని కోరారు.

## ఘనంగా గాయత్రి మహా యజ్ఞం....



**తాండూర్ ఆగస్టు 25 ప్రజాజ్యోతి** తాండూర్ మండలం కిష్టంపేట బస్టాండ్ సమీపంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం రోజున శ్రీ గాయత్రి మహ యజ్ఞము కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 20మంది దంపతులచే పూజా కార్యక్రమం మరియు హోమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని అన్న ప్రసాద వితరణ కార్యక్రమం విజయవంతం చేసారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు అందజేసిన సర్పంచ్ సతీష్, నారాయణ**



**ఆసిఫాబాద్ , ఆగస్టు 25 ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం వాంకిడి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ చునర్కర్ సతీష్, మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నూలే నారాయణతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు. కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీలో మరింత పారదర్శకత, సౌలభ్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు మండోకర్ తుర్సుబాయ్, ఇటంకర్ రాము, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సరండి ప్రజల మధ్యే కార్యదర్శి!

## సరండి పంచాయతీలో జాడి సోనం కొత్త పనితీరు..

## అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి.. ప్రజలతో మమేకం

**ఆసిఫాబాద్ ఆర్సీ, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):** గ్రామపంచాయతీ కార్యాలయంలో కుర్చీ వేసుకుని కూర్చోవడం ఒక అధికారి విధుల్లో భాగమే కావచ్చు.. కానీ ఆ కుర్చీని వదిలి ప్రజల మధ్యకు వెళ్లి వారి కష్టాలను తెలుసుకోవడం మాత్రం సేవాభావానికి నిదర్శనం. సమస్య చెప్పేందుకు ప్రజలే కార్యాలయానికి రావాలనే పరిస్థితి కాకుండా.. ప్రజల సమస్య ఏమిటో తెలుసుకునేందుకు అధికారి స్వయంగా గ్రామంలో తిరిగితే పాలనకు మరింత అర్థం వస్తుంది. వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి జాడి సోనం ప్రస్తుతం ఇదే తరహా పనితీరుతో ముందుకు సాగుతున్నారని స్థానికంగా సానుకూల చర్చ జరుగుతోంది. బాధ్యతలు స్వీకరించిన తర్వాత పంచాయతీ పరిధిలోని పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తూ.. ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా దాని గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపడం, ప్రజలు చెప్పే విషయాలను వినడం, అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారని పేర్కొంటున్నారు.

**సమస్యల కోసం ప్రజల వద్దకే..**

గ్రామంలో అసలు పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలంటే ఫైళ్లను చూడటం ఒక్కటే సరిపోదు. ప్రజల మధ్యకు వెళ్లి వారి మాట వినాలి. ఏ వీధిలో ఏ సమస్య ఉంది? ఎక్కడ మురుగు నిలుస్తోంది? ఎక్కడ తాగునీటి ఇబ్బంది ఉంది? ఏ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు మెరుగుపడాలి? వంటి అంశాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తేనే స్పష్టంగా తెలుస్తాయి. ఈ విషయాన్ని గుర్తించినట్టుగా జాడి సోనం గ్రామంలోని పరిస్థితులను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకునే అవకాశం కల్పిస్తూ.. వాటిపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. అభివృద్ధి పనులే కేంద్రంగా.. పంచాయతీకి వచ్చే నిధులు ప్రజల అవసరాలకు ఉపయోగపడాలంటే అభివృద్ధి పనుల ఎంపిక నుంచి వాటి అమలు వరకు పర్యవేక్షణ అవసరం. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు తదితర అంశాలపై దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్నారని సమాచారం.చేపట్టిన పనులు ఏ దశలో ఉన్నాయి? ప్రజలకు వాటి వల్ల ప్రయోజనం కలుగుతోందా? పనుల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అనే అంశాలను తెలుసుకోవడం ద్వారా పనులను మరింత సమర్థవంతంగా పూర్తి చేసే అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

**ప్రజలతో మాట్లాడటమే మొదటి అడుగు..**

ప్రజల సమస్య పరిష్కారంలో మొదటి అడుగు వారి మాట వినడమే. సమస్య చెప్పిన వ్యక్తిని పట్టించుకోకుండా పంపడం కంటే.. సమస్య ఏమిటో పూర్తిగా తెలుసుకుని స్పందించడం ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది. జాడి సోనం ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు ప్రాధాన్యం ఇస్తుండటం సానుకూల పరిణామమని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని వివిధ వర్గాల ప్రజలతో మమేకమై వారి అవసరాలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారని పేర్కొంటున్నారు.

**పారిశుద్ధ్యంపై అప్రమత్తత అవసరం**

వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. మురుగు కాలువలు, చెత్త నిర్వహణ, నిల్వ నీరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరం. ఈ అంశాలపై పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చని స్థానికులు అంటున్నారు. పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపర్చేందుకు కార్యదర్శి చొరవ చూపుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.




**సిబ్బందితో సమన్వయం.. పనుల్లో వేగం**

ఒక్క అధికారి ప్రయత్నంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం కాదు. పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సహకారం అవసరం. అందరితో సమన్వయం చేసుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లడం ద్వారా సమస్యలకు త్వరగా పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది. ఈ దిశగా సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పంచాయతీ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లేందుకు జాడి సోనం ప్రయత్నిస్తున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

**సమస్య చెప్పడానికి భయం ఉండకూడదు**

ఒక గ్రామంలో ప్రజలు తమ సమస్యను అధికారికి స్వేచ్ఛగా చెప్పగలిగితేనే ప్రజాస్వామ్య పాలనకు అసలు అర్థం ఉంటుంది. సమస్య చెప్పినందుకు ఎవరూ ఇబ్బందులు పడకూడదు. తమ సమస్యను చెప్పుకునేందుకు పంచాయతీ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఈ విషయంలో కార్యదర్శి ప్రజలకు చేరువగా ఉంటూ వ్యవహరిస్తుండటం మంచి పరిణామమని పలువురు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. పేరు కోసం కాదు.. పని కోసం గుర్తింపు రావాలి అధికారికి అసలైన గుర్తింపు ప్రచారంతో రాదు.. చేసిన పనితో వస్తుంది. ప్రజలు తమ సమస్య పరిష్కారమైందని చెప్పినప్పుడు వచ్చే సంతృప్తే ఒక అధికారికి నిజమైన గుర్తింపు. గ్రామంలో మార్పు కనిపించినప్పుడు ప్రజలే ఆ అధికారిని గుర్తిస్తారు. సరండి గ్రామపంచాయతీలో నూతన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన జాడి సోనం కూడా ఇదే విధంగా తన పనితీరుతో గుర్తింపు పొందే దిశగా ముందుకు సాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

**ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది..**

ప్రస్తుతం కనిపిస్తున్న చురుకుదనం ఇదే స్థాయిలో కొనసాగితే సరండి పంచాయతీలో అనేక సమస్యలకు పరిష్కారం చూపే అవకాశం ఉందని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రజల సహకారంతో పంచాయతీని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కార్యదర్శి ముందుకు సాగాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**ప్రజల నమ్మకమే అసలైన బలం**

ఒక అధికారి ఎంత సమర్థవంతంగా పనిచేస్తున్నాడో తెలుసుకోవడానికి పెద్ద పెద్ద మాటలు అవసరం లేదు.. ప్రజల స్పందన చాలు. తమ సమస్యలను చెప్పుకునేందుకు అధికారి అందుబాటులో ఉన్నాడని ప్రజలు భావిస్తే.. అదే పాలనపై నమ్మకానికి తొలి మెట్టు. సరండిలో జాడి సోనం ప్రజలతో మమేకమవుతూ, అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్నారని స్థానికంగా వినిపిస్తున్న సానుకూల స్పందన.. గ్రామ పాలనలో కొత్త ఆశలకు బాటలు వేస్తోంది. ప్రజల మధ్య నడిచే అడుగు.. సమస్యను వినే మనసు.. పరిష్కారం కోసం చేసే ప్రయత్నం.. అభివృద్ధి కోసం నిరంతర కృషి ఇవే ఒక గ్రామాన్ని ముందుకు నడిపించే అసలైన ఆయుధాలు. సరండి గ్రామపంచాయతీలో నూతన కార్యదర్శి జాడి సోనం చూపిస్తున్న చొరవ మరింత బలపడితే.. గ్రామాభివృద్ధికి అది ఒక మంచి ముందడుగుగా నిలిచే అవకాశం ఉంది.

## తాళం వేసిన ఇంట్లో చోరీ.. నిందితుడి అరెస్ట్




**రామకృష్ణాపూర్, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి):** రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ పద్మావతి కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన సిరికొండ శంకర్ (38)ను రామకృష్ణాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంటి తాళం పగుల గొట్టి వెండి, బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. తిమ్మాపూర్ చౌరస్తాలో వాహన తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడించారు. నిందితుడి పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తలుపులు, కిటికీలు పటిష్టంగా లాక్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

## పుస్తక పఠనంతోనే ఉజ్వల భవిష్యత్తు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**




**ఆదిలాబాద్ బ్యూరో,ఆగస్టు 25, (ప్రజా జ్యోతి )**పుస్తక పఠనం తోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పుస్తకాలను ఇష్టంగా చదివి నవారే సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. మంగళవారం నేరడిగొండ మండలం వాగ్దారి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథా లయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగా రాలని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పుస్తక పఠనం వల్ల సమాజంలో సానుకూల మార్పులు వస్తాయని, ప్రతి ఒక్కరిలో మంచి ఆలోచనలు పెంపొంది గ్రామాలు ఆదర్శంగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సెంట్రల్ లైబ్రరీ తరహాలోనే రాబోయే రోజుల్లో వివిధ ప్రాంతాల్లో ప బ్లిక్ రీడింగ్ రూమ్‌లను సైతం అందుబాటులోకి తీసు కువస్తామని వెల్లడించారు. చదువు ప్రతి ఒక్కరికి కీలక మని, యువత తమ కలలను సాకారం చేసుకునేం దుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకారం అందిస్తా మని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించిన వాగ్దారిలోని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి ఇంటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో 4 వేర్వేరు విభాగాలుగా చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రాక్టర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లను కలెక్టర్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, డీఎల్‌పీఓ ఫణిందర్, సర్పంచ్ విజయ్ కుమార్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

-- జిల్లా ఎస్పీ నితికా పంత్

ఊరేగింపులు, ర్యాలీల్లో విద్వేష ప్రసంగాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

-- ఎస్పీ నితికా పంత్

**ఆసిఫాబాద్ ఆర్సీ,ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మిలాద్-ఉన్-నబీ పండుగను శాంతియుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా జిల్లాలోని మసీదులు, ప్రార్థనా మందిరాలు, ప్రధాన కూడళ్లు, సున్నితమైన ప్రాంతాలు, ప్రార్థనా స్థలాలు, అలాగే ఊరేగింపులు, ర్యాలీలు మరియు ఇతర కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మేరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.కాగజ్‌నగర్ పట్టణంలో సుమారు 250 మంది పోలీస్ సిబ్బందితో, ఆసిఫాబాద్ పట్టణంలో సుమారు 70 మంది పోలీస్ సిబ్బందితో, కెరమెరి మండల కేంద్రంలో సుమారు 50 మంది పోలీస్ సిబ్బందితో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అదనంగా, అవసరమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్, మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. పండుగ సందర్భంగా ఊరేగింపులు, ర్యాలీలు మరియు ఇతర కార్యక్రమాల్లో ఎవరైనా విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం, ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రజలు, ముఖ్యంగా యువత పండుగ సందర్భంగా సంయమనం పాటించాలని, ఎలాంటి వివాదాలకు, ఘర్షణలకు లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని ఎస్పీ సూచించారు. ఊరేగింపులు, ర్యాలీల సమయంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఇచ్చే సూచనలు, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు.

**సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా**

మిలాద్-ఉన్-నబీ సందర్భంగా సోషల్ మీడియాలో వదంతులు, తప్పుడు సమాచారం, విద్వేషపూరిత పోస్టులు, అభ్యంతరకరమైన వీడియోలు, ఫోటోలు లేదా సందేశాలను ప్రచారం చేయవద్దని ఎస్పీ ప్రజలకు సూచించారు. ఇతరుల నుంచి వచ్చిన అనుమానాస్పద లేదా విద్వేషపూరిత సమాచారాన్ని ఫార్వర్డ్ చేయకుండా, వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సోషల్ మీడియా వేదికలపై శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు, మత విద్వేషాలను రెచ్చగొట్టే సందేశాలు మరియు అభ్యంతరకరమైన కంటెంట్‌పై పోలీస్ శాఖ నిఘా కొనసాగిస్తుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

**మత పెద్దలు, ప్రజాప్రతినిధులు సహకరించాలి**

మిలాద్-ఉన్-నబీ పండుగను శాంతియుతంగా నిర్వహించడంలో మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, మిలాద్ కమిటీ సభ్యులు, యువత మరియు ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు. ప్రతి ఒక్కరూ సోదరభావం, శాంతి, సామరస్యాన్ని కాపాడుతూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని, ఇతర మతాల మనోభావాలను గౌరవించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు, వివాదాస్పద ఘటనలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు గుర్తించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మిలాద్-ఉన్-నబీ పండుగను ప్రశాంతంగా, సోదరభావంతో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని, ప్రజల సహకారంతో పండుగను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు.

# నేరడిగొండ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ

## సిబ్బంది నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహించాలి

## విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలి: ఎస్పీ అఖిల్ మహాజన్

**నేరడిగొండ, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):**విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేస్తూ గ్రామాల్లో సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. మంగళవారం నేరడిగొండ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించి స్టేషన్‌లో నమోదైన కేసులు, దర్యాప్తు వివరాలు, రికార్డులు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రతి పోలీసు అధికారి తనకు కేటాయించిన గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ గంజాయి, గుడుంబా, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ ఆదేశించారు. గ్రామాల్లో ఏదైనా అనుమానాస్పద సమాచారం లభిస్తే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు చేరేలా సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు.పోలీస్ సిబ్బంది నిబద్ధత, నీతి, నిజాయితీతో విధులు నిర్వహించాలని, క్రమశిక్షణ, సమయపాలన, జవాబుదారీతనం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరిస్తూ, ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత గ్రామ పోలీసు అధికారిని విచారణకు కేటాయించి బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజూ సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. బ్లూకోల్ట్, డయల్-100/112 విధులను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ మైనర్ డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు.



రాత్రి గస్తీ సమయంలో ఫింగర్‌ప్రింట్ పరికరాలను వినియోగించి అనుమానితులు, నేరస్తుల వేలిముద్రలను సేకరించి పరిశీలించాలని తెలిపారు.మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదులను సీఈఐఆర్ ద్వారా నమోదు చేసి ఫోన్లను తిరిగి పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. పిటిషన్ మేనేజ్‌మెంట్‌పై సిబ్బంది ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నూతన సిబ్బంది సీనియర్ అధికారుల వద్ద పోలీస్ స్టేషన్ విధులు, రికార్డుల నిర్వహణపై అవగాహన పొందాలని సూచించారు.పోలీస్ స్టేషన్ ఆవరణలోని వాహనాల స్థితిగతులను పరిశీలించిన ఎస్పీ, సిబ్బందికి ఏవైనా



సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమాజంలో పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగేలా విధులు నిర్వహిస్తూ ఆదిలాబాద్ జిల్లా పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించాలని సూచించారు.అదేవిధంగా కుప్తి బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన మరమ్మతులు చేపట్టి బ్రిడ్జిని తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్. రమేష్, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫర్నిచర్ ధ్వంసం చేసిన వ్యక్తుల్ని పట్టుకుంటాం

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన


## ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్

**ఖానాపూర్ ఆగస్టు 25 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ మంగళవారం సందర్శించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని గురువులను తల్లిదండ్రులను గౌరవించాలని అన్నారు మొన్న ఆదివారం రాత్రి పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల రూమ్ తాళం పగలగొట్టి విద్యార్థులు చదువుకున్న టున్నా టేబుల్ లను ఫ్యాన్లను ఫర్నిచర్ ధ్వంసం చేసిన వాళ్ళని పట్టుకుని చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సమస్యలను పరిష్కరిస్తామని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొప్పారపు సత్యవతి నా



యకులు ఎనగందుల నారాయణ ప్రకాష్ గౌడ్ పట్టణ అధ్యక్షులు మనోజ్ కాశివేణి ప్రణయ్ ఆసం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

# బ్రాండ్ తెలంగాణను ప్రపం చస్థాయిలో బలోపేతం చేసేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలి



**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు**

**పర్యాటక ప్రాంతాలను ప్రా ధాన్యతా ప్రాతిపదికన అభి వృద్ధి చేయాలి**

**30న జరిగే నీట్--పీజీ పరీక్ష కు అన్ని ఏర్పాట్లుపటిష్టంగా చేపట్టాలి**



**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 25, (ప్రజా జ్యోతి )**తెలంగాణను దేశ, విదేశీ పర్యాటకులకు ఆకర్షణీయమై న గమ్యస్థానంగా తీర్చిదిద్ది బ్రాండ్ తెలంగాణను ప్రపంచస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్ర ధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి వర్షా భావ పరిస్థితులు,నీట్--పీజీ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక అభివృద్ధి తదితర అంశాల పై అన్ని జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చే సిన 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని, ప్రతి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అను సంధానిస్తూ సమగ్ర అభివృ ద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. యా దాద్రి, భద్రాచలం, బాసర, వరంగల్, ఆలంపూర్, కీస రగుట్ట, కల్వకుర్తి, మెదక్, నల్గొండ, పోచంపల్లి, కరీంనగర్, చార్మినార్, గోల్కొండ, మేడిగడ్డ, పాఖల్, మణుగూరు, కవాల్, ఏటూరునా గారం, వేదురు కొండ, నాగా ర్జునసాగర్,మహబూబ్‌నగర్, నార్సాపూర్, చేర్యాల తదితర ప్రాంతాలతో పాటు బుద్ధ వాటర్ ట్రెయిల్ స ర్క్యూట్, బౌద్ధ సర్క్యూట్‌లను సమగ్ర పర్యాటక గమ్య స్థానాలుగా అభివృద్ధి చేయాల ని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, శుభ్రత, సూచిక బోర్డులు, ఇతర సందర్శకుల సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు. ప్రతి ప్రత్యేక పర్యాటక ప్రాంతానికి స్పష్టమైన అ భివృద్ధి కార్యాచరణ, బాధ్యతలు, కాలపరిమితి రూపొందించి పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్థానిక ఆహారం, సంస్కృతికి ప్రాధాన్యతనిస్తూ స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, హోమ్‌స్టేలు, స్థానిక గైడ్ సేవలను ప్రోత్సహించాలని తెలిపారు.ఆగస్టు 30న నిర్వహించ నున్న నీట్--పీజీ 2026 ప్రవేశ పరీక్ష పై సమీక్షి స్తూ, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల్లో 17,627 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంట లకు ప్రారంభమై మధ్యా హ్నం 12.30 గంటలకు ము గుస్తుందని, అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాల కు చేరుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాభవ పరిస్థితులపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో ప్రస్తుతం 22 శాతంలోటు వర్షపాతం నమోదైందని, సెప్టెంబర్ చివరి వరకు పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదని వా తావరణ నిపుణులు సూచించినట్లు తెలిపారు. ఇప్ప టివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.20 కోట్ల ఎకరాల్లో పంటల సాగు జరిగిందని, గత వానాకాలంలో సుమారు 1.38 కోట్ల ఎకరాల్లో సాగు జరిగినట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు, సాగునీరు, తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమై న ముందస్తు చర్యలు చేప ట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ విసి హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజర్షిషా సంబంధిత శాఖల అధి కారులతో హాజరై మాట్లాడుతూ, కుంటాల వాటర్ ఫా ల్స్ సమీపంలో జరుగుత్ను కుంటాల రిసార్ట్ పనులు 80 శాతం పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్ట్‌ను పీపీపీ విధా నంలో ఆపరేషనలైజ్ చేయడానికి ఆసక్తిగల ఇన్వెస్టర్ల ను సంప్రదిస్తామని తెలిపారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుండి టూరిస్టు లు ఇక్కడికి వస్తారని తెలి పారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు, విద్యాశాఖ అధికారి మాధవి, డిఐఈఓ గణేష్, ఇతర అధికారులు తదితరులు, సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

## బీర్ నంది జెడ్పి ఎస్ఎస్ లో వాన మహోత్సవం పాల్గొన్న డిఎం హెచ్ఓ డాక్టర్ రాజేందర్



**ఖానాపూర్ ఆగస్టు 25 (ప్రజా జ్యోతి )**వన మహోత్సవ లో భాగం గా ఖానాపూర్ మండలంలోని బీర్ నంది జెడ్ పి ఎస్ ఎస్ పాఠశాల లో మంగళవారం జరిగింది ఇందులో డి ఎం హెచ్వో డాక్టర్ రాజేందర్ ఎంపీడీవో రాథోడ్ రాధ సర్పంచ్ నవీన్ యాదవ్,ఉపసర్పంచ్ రాకేష్,హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి ఎల్ వి ప్రసాద్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి మేడం పంచాయతీ సెక్రటరీ దేవేందర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు పచ్చదనం పరిశుద్ధతను పాటించి మొక్కలు నాటి ఆహ్లాద వాతావరణాన్ని సృష్టించితే విద్యార్థులకు అనారోగ్య సమస్యలు ఉండవని పలువురు వ్యాఖ్యానించారు

## సామాజిక న్యాయానికి బీపీ మండల్ స్ఫూర్తి

**అణగారిన వర్గాలకు రిజర్వేషన్ల ద్వారా రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన మహనీయుడు**



**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజా జ్యోతి):** సామాజిక న్యాయానికి చిహ్నంగా నిలిచిన, మండల్ కమిషన్ సృష్టికర్త, వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వరీ ప్రసాద్ (బీపీ) మండల్ 108వ జయంతి వేడుకలను మంగళవారం మంచిర్యాల బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అణగారిన వర్గాలకు రిజర్వేషన్ల ద్వారా రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన మహనీయుడు బీపీ మండల్ అని నాయకులు కొనియాడారు. రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా ఆయన అందించిన సేవలు, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు.ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మంచర్ల సదానందం మాట్లాడుతూ "సామాజిక న్యాయం వర్ధిల్లాలి.. కులం కాదు--న్యాయం కావాలి" అని చాటిన గొప్ప నాయకుడు బీపీ మండల్ అని అన్నారు. వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమని తెలిపారు. మండల్ కమిషన్ సిఫార్సుల ద్వారా వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం సామాజిక మార్పుకు బాటలు వేసిందన్నారు. బీపీ మండల్ ఆశ యాలను కొనసాగిస్తూ బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ మైన హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏదునూరి రమేష్, జేఏసీ కోశాధికారి మోర ప్రభాకర్, దయ్యాల అశోక్, సాయిరే బాబురావు, పడాల శంకర్, నగునూరి సారయ్య, రణధీర్, బి. సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి పెద్దపీట వేయాలి






**ఆర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలి**

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 25, (ప్రజా జ్యోతి )**అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయో జనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాల లబ్ధికి దూరం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూ చించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, పాఠశాల విద్యార్థుల ఏకరూప దుస్తులకు ట్టుపనులు, జలసిరి తదితర సంక్షేమ కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికా రులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడు తూ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులైన పేదలందరినీ సాచురేషన్ విధానంలో గుర్తించి ప్రయోజనం కల్పించాలని ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా నిర్దేశించిన జాబితాతో పాటు క్షేత్రస్థాయిలో ఉన్న గుడిసెల ను సమగ్రంగా గుర్తించి, అర్హ త కలిగిన ప్రతి కుటుంబాన్ని జాబితాలో చేర్చాలని సూచించారు. పట్టణాలు, మురి కివాడలు, గ్రామీణ ప్రాంతాల్లోని గుడిసెలను ప్రత్యేకంగా గుర్తించి, అర్హత ఉన్నవారికి వెంటనే ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపటా ్టలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో అర్హుల గుర్తింపు, దరఖాస్తుల పరిశీలన, మంజూరు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు అందించాల్సిన ఏకరూప దుస్తుల కుట్టుపనులను వేగవంతం చేసి, ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నిర్ణీత సమయంలో దుస్తులు అందేలా సంబంధిత అధికారులు నిరం తరం పర్యవేక్షించాలని సూచించారు. పింఛన్లు, జలసిరి తదితర సంక్షేమ పథకాల అమలుపై సమీక్షిస్తూ, పెండింగ్‌లో ఉన్న దరఖా స్తులను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్ర భుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎదు రవుతున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరిం చాలని, నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిఆర్డీఓ రవీందర్, డిపిఓ రమేష్, డిఈఓ మాధ వి, హౌసింగ్ పీడీ శంకర్, వి విధ శాఖల అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

# విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీఠ






**జిల్లా కలేక్టర్ రాజర్షి షా**

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదులకు ప్రారంభోత్సవం**

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 25, (ప్రజా జ్యోతి)** విద్యా రంగం అభివృద్ధికి ప్ర భుత్వం పెద్ద పీట వేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక బొక్కల్‌గూడ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన నూతన అదనపు తరగతి గదులను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కళాశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటి నీరు పోశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫలితాలను మెరుగు పరి చేందుకు ప్రత్యేకంగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి, తగి న చర్యలు తీసుకుంటున్న ట్లు తెలిపారు. అత్యధికంగా 1,200 మంది విద్యార్థులతో నాలుగు మీడియాలలో విద్యాబోధన సాగుతున్న ఈ కళాశాల జిల్లాకే తలమాని కమని కొనియాడారు. అ సంపూర్తిగా ఉన్న మొదటి అంతస్తులోని నాలుగు నూ తన గదులను ఖర్చుకు వెనుకాడకుండా పూర్తి చేసి నేడు ప్రారంభించడం ఎంతో సంతోషకర మన్నారు. విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలోనే ఉండి ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా అభ్యసించాలని సూచించారు. తరగతులకు క్రమం తప్పకుండా హాజరైతేనే సబ్జెక్టులపై పూర్తి పట్టు లభిస్తుందని, తద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యప డుతుందని స్పష్టం చేశారు. అలాగే, కళాశాలలో అందుబాటులో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్ పి ) ద్వారా నీట్, ఎంసెట్ వంటి ఉన్నత స్థాయి పోటీ పరీక్ష లకు అవసరమైన డిజిటల్ కోచింగ్‌ను సద్వినియోగంచే సుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, విద్యతోనే భవిష్యత్ ఉందని, అధ్యాప కులను గౌరవించి సలహాలు సూచనలు పాటించాలని అన్నారు. ప్రతి ఒక్కరు ఒక్కో మొక్క చొప్పున నాటి సమీ క్షించాలని అన్నారు. అనంతరం ఇంటర్మీడియట్ మొ దటి సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థు లకు మెమంటోలను కలెక్టర్, అతిథులు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, డీఐఈవో గణేష్ జాదవ్, డీఎంబ్ల్యూవో కలీం, ము న్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వివిధ వార్డుల కౌన్సిలర్లు సుచిక, సుష్మా, సంజయ్, జీవన్, ఇతర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఎంపీఓ గోవర్ధన్



**దిలావర్ పూర్ , ఆగస్టు 25,( ప్రజాజ్యోతి ).**దిలావర్ పూర్ ఎస్సీ బాలుర హాస్టల్ ని ఎంపీ ఓ తనిఖీ చేయడం జరిగింది దీనిలో భాగంగా స్టాక్ రిజిస్టర్ మరియు కిచెన్ రూమ్‌లో పరిశీలించి వారు పిల్లలకు ఎలాంటి భోజనం పెడుతున్నారు పరిశీలించడమైనది మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని తనిఖీ చేయడమైనది వర్షాకాలం కాబట్టి ఆహారం పైన దోమలు ఈ గలు వాలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వసతి గృహంలోని లైటింగ్, కిటికీలకు జాలీలు,నీరు, మరుగు దొడ్లు, వంట సామగ్రి తదితర సౌకర్యాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు.పిల్లలు మెనూ ప్రకారం భోజనము మరియు హెల్త్ చెకప్ గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. విద్యార్థులు సైతం సంతృప్తిని వ్యక్తం చేయడం జరిగింది (ఎంపీ ఓ) స్పెషల్ ఆఫీసర్ వెంట హాస్టల్ వార్డెన్ మురళి ఈవో మహేందర్ పాల్గొన్నారు

## సోనాల పాఠశాలలో వన మహోత్సవం



**సోనాల, ఆగస్టు 25 ( ప్రజాజ్యోతి ):**సోనాలలో వన మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా మరియు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. పర్యావరణ పరిరక్షణ, గ్రామంలో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీ ప్రాంగణాలు మరియు ఖాళీ స్థలాలలో విరివిగా నీడనిచ్చే, పూల మరియు పండ్ల మొక్కలను నాటారు. అంతే కాకుండా, ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. **భాగస్వామ్యం:** గ్రామానికి చెందిన డిప్యూటీ కమిషనర్ సుధాకర్, విద్యార్థులు, అధికారులు ఎంపీడీవో రత్నాకర్ రావు, మహిళలు మరియు స్థానిక సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి, నాయకులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమంలో చేయి చేయి కలిపారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించడం మరియు నీరు పోసి కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించారు.

# పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులందరికీ పెన్షన్ కల్పించాలంటూ

## ఖానాపూర్ లో కార్మికులర్యాలీ, ధర్నా

**ఖానాపూర్, ఆగస్టు 25 (తెలుగుప్రభ) :** ఖానాపూర్ పట్టణంలో పీఎఫ్ ఉన్న బీడీ కార్మికుల కశీదరికి మాట ఇచ్చిన ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ (జీవన భృతి) కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెనసురేష్ మాట్లాడుతూ, ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న ఆన్లైన్ దరఖాస్తులలో బీడీ కార్మికులకు అవకాశం కల్పించకపోవడం శోచనీయం అన్నారు ఎన్నికల హామీ మేరకు బీడీ కార్మికులకు కొత్త వారందరికీ రూ.4,016 పింఛన్, రిటైర్మెంట్ తర్వాత బీడీ కార్మికులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని, ప్రతి నెల 26 రోజులు పని దినాలు కల్పించాలని అన్నారు. తాజా మార్గదర్శకాల ప్రకారం ఒంటరి మహిళలు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, దివ్యాంగులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితుల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొనడం, కార్మికులకు మోసం చేయడమేనని అన్నారు జిల్లాలో బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు లక్షన్నరకు పైగా ఉన్నారని, వీరిలో బీడీలు చుట్టే మహిళలతో పాటు పరిశ్రమలో పనిచేసే ప్యాకర్లు, చాటాన్వాలలు ఉన్నారని ప్రస్తుతం జిల్లాలో కేవలం 61వేల 933 మందికి మాత్రమే పింఛన్లు అందుతున్నాయని, ఇంకా పెంచుతామని హామీలు ఇచ్చినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని, సే టు యు నాయకులు విమర్శించారు ఒకవైపు ప్రభుత్వ ఆంక్షలు, మరోవైపు కంపెనీల దోపిడీతో బీడీ పరిశ్రమ రోజురోజుకూ కుదేలవుతోందని ఆవేదన చెందారు. కొన్ని యాజమాన్యాలు వారంలో కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే పని దినాలు కల్పించడంతో కార్మికుల ఉపాధి పూర్తిగా దెబ్బతింటోందని, చాలీచాలని కూలీతో కుటుంబాలను పోషించుకోవడం గగనంగా మారిందని,అన్నారు

**ఆగస్టు 31 వరకు బీడీ కార్మికుల దరఖాస్తులు స్వీకరించాలి**

ఆగస్టు 31 తీసుకోనున్న ఆన్లైన్ దరఖాస్తులలో బీడీ కార్మికులకు కూడా అవకాశం కల్పించాలని,ఎలాంటి ఆంక్షలు కటాఫ్ తేదీల నిబంధనలు లేకుండా అర్హత కలిగిన ప్రతి బీడీ కార్మికురాలికి జీవన భృతి (చేయూత పింఛన్) అందించాలని, వచ్చే నేతలు హామీలు ఇవ్వడం కాకుండా ఆచరణలో వాటిని అమలు చేసి బీడీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ మండల కన్వీనర్ ఎండి రియాసత్, బీడీ




అండ్ సిగర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గంగామణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు దాకూర్ తిరుపతి, వ్యవసాయం కార్యక్రమం జిల్లా ఉపాధ్యక్షుడు చుంచుల నారాయణ, ఖానాపూర్ మండలం ఉపాధ్యక్షులు, నాగుల నర్సా గౌడ్, మండల నాయకులు చింతకుంట్ల శంకర్, అది రాజన్న, బీడీ టేకేదార్ కన్నె సత్తన్న, తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ బీడీ ప్యాకర్స్ యూనియన్ సత్తనపల్లి బ్రాంచ్ అధ్యక్షులు పెద్దన్న, కార్యదర్శి ఆత్రం భీమ్రావు, రాములు, భోజన్న, సాయబు రావు, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్య సాధనకు సంకల్పం.. క్రమశిక్షణతో కృషి చేయాలి








**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సీపీ అంబర్ కిషోర్ ఝా**
**నిపుణ ఎస్ఐ, పీసీ ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం**

**మంచిర్యాల, 25, ఆగస్టు ( ప్రజా జ్యోతి):** ఎంచుకున్న లక్ష్యాన్ని దృఢ సంకల్పం, క్రమశిక్షణ, నిరంతర కృషితో సాధించుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రతి రోజును కౌంట్డౌన్గా భావించి లక్ష్య సాధనకు క్రమశిక్షణతో కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో జిల్లా కలెక్టర్, రామగుండం పోలీస్ కమిషనర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "నిపుణ" ఎస్ఐ, పీసీ ఉచిత శిక్షణ కేంద్రాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఎ. భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, ఆర్ఐ సంపత్‌తో కలిసి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వర్తించే పోలీసు శాఖలో ఎస్ఐ, పీసీ పోస్టుల కోసం అందిస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్తమ శిక్షకుల ద్వారా నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా అందిస్తున్నట్లు తెలిపారు.అభ్యర్థులు పూర్తి ఏకాగ్రతతో శిక్షణ పొంది, నిర్ణీత సమయంలో సిలబస్‌ను పూర్తి చేయాలని సూచించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన, లోతైన పట్టు అవసరమని తెలిపారు. ప్రిలిమ్స్‌లో వేలాది మంది అభ్యర్థులు పోటీపడుతున్న నేపథ్యంలో అత్యుత్తమంగా రాణించి ముందంజలో ఉండేలా సిద్ధం కావాలని, మెయిన్స్‌లోనూ అత్యున్నత స్థాయిలో పోటీపడే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.అందుకు అనుగుణంగా స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని సన్నద్ధం కావాలని, క్రమం తప్పకుండా తరగతులకు హాజరై తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఉచితంగా అందిస్తున్న శిక్షణను, నిర్వహించే పోటీ పరీక్షలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకుని తమ వ్యక్తిగత సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలని సూచించారు. సబ్జెక్టులోని ప్రతి అంశంపై పట్టు సాధిస్తూ ముఖ్యమైన విషయాలను నోట్స్‌గా రాసుకోవాలని తెలిపారు.ప్రతి రోజును కౌంట్‌డౌన్‌గా భావించాలన్నారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, పరీక్షకు మిగిలి ఉన్న ప్రతి రోజును కౌంట్‌డౌన్‌గా భావించి సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. సెలవులు, ఇతర కారణాలను పక్కనపెట్టి క్రమశిక్షణతో శిక్షణకు హాజరవుతూ తమ నైపుణ్యం, సామర్థ్యాన్ని నిరంతరం పెంచుకోవాలని తెలిపారు.విజయం సాధించాలంటే దైనందిన అలవాట్లలో మార్పు తీసుకురావాలని, శిక్షణ సమయంలో పూర్తి ఏకాగ్రతతో ఉండాలని అన్నారు. ప్రతిరోజూ కొత్త విషయాలను నేర్చుకుంటూ, నేర్చుకున్న అంశాలను పునరావృతం చేసుకోవాలని సూచించారు.ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు దృఢ సంకల్పంతో ముందడుగు వేయాలని, ప్రతి పనిలో నైపుణ్యం సాధించాలని తెలిపారు. కేవలం ఉద్యోగం పొందడమే కాకుండా, ఉన్నత స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో కృషి చేయాలని అభ్యర్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రవెల్లి పి.ఆర్.టి.యు నూతన కార్యవర్గం ఎన్నిక




**అదిలాబాద్ టౌన్, ఆగస్ట్ 25 ( ప్రజా జ్యోతి )**పి ఆర్ టి యు టి ఎస్ శాఖ నూతన కార్యవర్గాన్ని పి ఆర్ టి యు భవన్‌లో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పవర్ అంబాజీ, ప్రధాన కార్యదర్శిగా ఆడే ప్రేమ్ దాస్, అసోసియేట్ అధ్యక్షులుగా చౌవాన్ సంతోష్ కుమార్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఆత్రం కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా జాదవ్ సంతోష్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఆడే మంజుల, కార్యదర్శులుగా పూసం నాందేవ్, బుక గంగయ్య, మహిళా కార్యదర్శులుగా బట్టు అరుణ స్వప్న ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు జిల్లా శాఖ ప్రతినిధులు శుభా కాంక్షలు తెలియజేసి, సంఘ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఐటీఐ, ఏటీసీలో వాక్-ఇన్ అడ్మిషన్లు

**ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు అవకాశం**

**ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వరరావు**



**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజాజ్యోతి):** మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో 2026 విద్యా సంవత్సరానికి వాక్-ఇన్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు కనీసం 14 సంవత్సరాల వయస్సు ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీలో అందుబాటులో ఉన్న వివిధ సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, సెప్టెంబర్ 5న మధ్యాహ్నం 1 గంటకు వాక్-ఇన్ అడ్మిషన్లు ముగుస్తాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో ఐటీఐ, ఏటీసీని సంప్రదించాలని సూచించారు. ఐటీఐ, ఏటీసీలో నైపుణ్య శిక్షణ పొందడం ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వరరావు తెలిపారు. మంచిర్యాల జిల్లా యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ పొందాలని ఆయన కోరారు.

## మాట నిలబెట్టుకున్న దేశ్ముఖ



**బాసర ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** బాసర మండలంలోని రేణుకా పూర్ హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి రూ. 2 లక్షలు విరాళం గా ఇస్తానని ఇచ్చిన మాటను దేశ్ముఖ సంజీవరావు నిలబెట్టుకున్నారు. ఇందులో భాగంగా సోమవారం రూ. 35 వేల విలువైన ఇసుక, రూ. 10 వేల విలువైన కంకరను ఆలయ నిర్మాణం కోసం తీసుకువచ్చి ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు. మిగిలిన మొత్తాన్ని విడతలవారీగా అందజేస్తానని తెలిపారు.హనుమాన్ భక్తుడైన సంజీవరావు గత 40 ఏళ్లుగా రేణుకాపూర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణానికి తనవంతు సహకారం అందించడం పట్ల కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఫ్యాట్ల సుఖేష్‌రావు, బాసర మున్నూరు కాపు అధ్యక్షుడు సీహెచ్ నాగరాజ్ ప్రతాప్‌రావు, బాసర మండల బీజేపీ అధ్యక్షుడు పుట్నాల సాయి నాథ్, జంగం రాజేందర్, గంగాధర్, సంజీవరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో పశువులు మృతి: బాధితులకు పరిహారం అందజేత



**ఆసిఫాబాద్ ఆగష్టు 25 ప్రజా జ్యోతి** విద్యుత్ ప్రమాదాల కారణంగా పశువులను కోల్పోయిన రైతులకు విద్యుత్ శాఖ ఆసరాగా నిలిచింది. ప్రమాదాల్లో మూగజీవాలు మృతిచెందిన యజమానులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం నష్టపరిహార చెక్కులను అందజేసింది. వివరాల్లోకి వెళ్తే.. దహెగాం మండలానికి చెందిన దుర్గం పురుషోత్తం గేదె విద్యుత్ షాక్‌తో మృతిచెందగా, ఆయనకు రూ. 40 వేల పరిహారం చెక్కును అధికారులు పంపిణీ చేశారు. అలాగే సిర్పూర్-టి మండలానికి చెందిన పి. అంకన్నకు చెందిన మేక మృతిచెందడంతో నిబంధనల మేరకు రూ. 7 వేల నష్టపరిహారం చెక్కును అందజేశారు.సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) జాడే ఉత్తమ్ కుమార్, సిర్పూర్-కాగజ్‌నగర్ ఏడీఈ (ఆపరేషన్స్) ఇర్ఫాన్ అహ్మద్, కౌటాల ఏడీఈ ఆధ్వర్యంలో బాధితులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రమాదాల్లో పశువులను కోల్పోయి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు సకాలంలో పరిహారం అందించి ఆదుకోవడం తమ బాధ్యత అని తెలిపారు. గ్రామాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు, లైన్లు, స్తంభాల విషయంలో ప్రజలు, రైతులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## తేజాపూర్ లో ఉచిత వైద్య శిబిరము ప్రత్యేక వైద్యులు రాక

**నేరడిగొండ ఆగస్ట్ 25 ( ప్రజా జ్యోతి ):** మండలంలోని తేజపూర్ గ్రామంలో హార్వెస్ట్ మినిస్ట్రీస్ ఆశ్రయం హ్యాండ్ ఆప్ హోప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరము ఈనెల 28వ తేదీ శుక్రవారం రోజున ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంట ల వరకు తేజపూర్ గ్రామంలోని రైతు వేదిక దగ్గర ఈ శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఈ శిబిరానికి హైదరాబాద్ నుండి ప్రత్యేక వైద్యులు వచ్చి రక్త పరీక్షలు, బీపీ ,షుగర్, అలాగే ఎక్సరే, ఈసీజీ,దంత పరీక్షలు ,గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలకు, పలు రకాల వైద్య సేవలు అందించడం జరుగుతుందని కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలు కూడా ఇవ్వడం జరుగుతుందని వైద్య పరీక్షల అనంతరం మందులు కూడా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని మిగతా వివరములకు పాస్టర్ డేవిడ్ పాల్ 8639 325729 అను చేరవాణి నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

## పిల్లల భవిష్యత్తే మా బాధ్యత ఆలోచనతో భవిష్యత్తు ఉజ్వల ముగా ఉండాలని విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ

**సాయంత్రం 3:30 గంటలకు ముగించాల్సిన పాఠశాల విద్యార్థులకు చదువు బాగా రావాలని 5 గంటల వరకు ప్రతేక్య బోధన చేస్తున్న,హెడ్మాస్టర్ లింగారెడ్డి**

**వెంకట్రావుపేట్ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలతో హృదయపూర్వక ధన్యవాదములు అన్నారు:**





**ఆగస్టు25,సిర్పూర్(టి) కానిస్టేన్సి కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని వెంకట్రావుపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్య బోధన చేస్తున్న హెడ్మాస్టర్ లింగారెడ్డి నాలుగో తరగతి నుండి 5వ తరగతి గల విద్యార్థులకు చదువు బాగా రావాలని సదుద్దేశంతో ప్రత్యేక విద్యా బోధన శ్రీకారం చుట్టారు. పిల్లల భవిష్యత్తు నా బాధ్యత అనే మంచి ఆలోచనలతో విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలముగా ఉండాలని వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక విద్య బోధన చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సాయంత్రం 3:30 గంటల వరకు మాత్రమే తరగతులు నిర్వహించాల్సి ఉండగా విద్యార్థులకు చదువు బాగా రావాలని సదుద్దేశంతో వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ సాయంత్రం 5:00 గంటల వరకు అధినంగా విద్య బోధన చేస్తున్నారు. విద్యార్థుల చదువుపై ఇంతటి శ్రద్ధ చూపిస్తూ పాఠశాల సమయం ముగిసిన తరువాత కూడా విద్యార్థులకు చదువు చెప్పడం నిజంగా అభినందనీయమని వెంకట్రావుపేట్ గ్రామ విద్యార్థుల తల్లిదండ్రుల తరఫున హృదయ పూర్వక అభినందనలు తెలుపుతూ!భవిష్యత్తే మా బాధ్యత అనే ఆలోచనల తో సేవ చేస్తున్న హెడ్మాస్టర్ లింగ రెడ్డి కు ప్రత్యేక కృతజ్ఞతలతో ధన్యవాదములు తెలియజేశారు.

## వన మహోత్సవంలో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు



**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 25 ప్రజా జ్యోతి,** వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ ముత్యం రమ ఉప సర్పంచ్ దుర్గం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సుమారు 20 మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సర్పంచ్ సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపేందుకు కృషి చేస్తామని తెలిపారు. వన మహోత్సవ కార్యక్రమం సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలోపాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఈసీ, ఎఫ్ఏ, వీఆర్ఏ, జీఆర్ఏఎం, కూలీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 63 నైపుణ్య విభాగాల్లో పోటీకి అవకాశం



**మంచిర్యాల, 25,ఆగస్టు (ప్రజాజ్యోతి):** యువతలో నైపుణ్య ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక స్కిల్ ఇండియా కాంపిటీషన్ 2026--27కు రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని ప్రభుత్వ ఐటీఐ మంచిర్యాల ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలో 63 నైపుణ్య విభాగాల్లో అభ్యర్థులకు పాల్గొనే అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు స్కిల్ ఇండియా డిజిటల్ పోర్టల్ ద్వారా ఉచితంగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం వెబ్‌సైట్‌లో మొబైల్ నంబర్ ద్వారా లాగిన్/రిజిస్టర్ చేసి, ఓటీపీ ధ్రువీకరణ, ఆధార్ ఈ--కేవైసీ పూర్తి చేసిన అనంతరం డాష్‌బోర్డులో ఇండియా స్కిల్ కాంపిటీషన్ 2026--27ను ఎంపిక చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పోటీలకు ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, పాఠశాలలు, కళాశాలలు, శిక్షణ సంస్థలకు చెందిన విద్యార్థులు, శిక్షణార్థులు అర్హులని పేర్కొన్నారు సాధారణంగా 16--21 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి అవకాశం ఉండగా, కొన్ని నైపుణ్య విభాగాలకు 24 సంవత్సరాల వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రపంచ స్థాయి నైపుణ్య పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వరరావు కోరారు.

## కస్తూరిభా బాలికల పాఠశాలలో వన మహోత్సవం



**లక్ష్మణ చాంద, ఆగస్టు 25 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలో గల కస్తూరిభా బాలికల పాఠశాల తో పాటు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం రోజున ఎంపీడీవో సరోజ సమక్షంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని అన్నారు. మనమంతా ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవనము కొనసాగించాలంటే ప్రకృతిలో మొక్కలు నాటడం ఎంతో అవసరమని అన్నారు. మొక్కలు నాటి ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడితే మానవాళి మనుగడ ఉంటుందని ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కంకణ బద్దులు కావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ నసీరుద్దీన్, ఏపీవో ప్రమీల, కేజీబీవీ ఎస్ఓ నవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## షాట్‌పుట్‌లో వాంకిడి కుర్రాడి కేక!

జిల్లా స్థాయి పోటీల్లో గోవింద్‌రావు సత్తా..

రాష్ట్రస్థాయికి ఎంపిక

విజేతకు బంబార సర్పంచ్ అభినందనలు




**ఆసిఫాబాద్ ఆగస్టు 25 ప్రజా జ్యోతి** అండర్-16 విభాగం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వాంకిడి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి కోర్కెట గోవింద్‌రావు రికార్డు స్థాయి ప్రతిభతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. 9వ తరగతి చదువుతున్న గోవింద్‌రావు షాట్‌పుట్ విభాగంలో చూపిన ప్రతిభకు గాను ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బంబార గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైన గోవింద్‌రావును అభినందిస్తూ.. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాడే సంతోష్, పీడీ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు రాంషా, రామచందర్ తదితరులు పాల్గొని విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు.

## పచ్చటి మొక్కలతో భవిష్యత్తు తరాలకు భరోసా

రాయిగూడ సర్పంచ్ పెం దూర్ లక్ష్మణ్ రావు



**సిరికొండ, ఆగష్టు 25,( ప్రజా జ్యోతి )** పచ్చటి మొక్కలు నాటడమంటే భవిష్యత్తు తరాలకు మంచి భోరోసా ఇవ్వడమేన ని రాయిగూడ సర్పంచ్ పెం దూర్ లక్ష్మణ్ రావు అన్నారు. మంగళ వారం వన మహోత్సవంలో భాగంగా సిరి కొండ మండలంలోని రాయిగూడ ఆశ్రమ పాఠశాలమై దానంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు విజయ్ ప్రకాష్, వారి సిబ్బందితో కలిసి సర్పంచ్ పెందుర్ లక్ష్మణ్‌రావు మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పచ్చటి మొక్కలు నాటడం అంటే భవిష్యత్తు తరాలకు భరోసా కల్పించడమే అని అన్నారు. ప్రతి ఒక్కరు మొ క్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రకాష్, ఉపాధ్యయులుము కుంద్ రావు, సిడాం కేశవ్, ప్రభాకర్, శ్రీరామ్,తుకోడోజీ, శంబు, సునీత,జోష్నా, పీల్డ్ అసిస్టెంట్ ధర్మన్న, టెక్నీకల్ అసిస్టెంట్‌లు స్వరూప, గోపాల్, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లు ముడి బియ్యం సరఫరా వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు



**మంచిర్యాల, 25 ఆగస్టు (ప్రజా జ్యోతి):** జిల్లాలో ధాన్యం సేకరణకు సంబంధించిన సిఎంఆర్ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా బియ్యం సరఫరాను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు రైస్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో తన ఛాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి రైస్ మిల్లర్లతో సిఎంఆర్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పౌరసరఫరాల సంస్థ ఆదేశాల మేరకు రైస్ మిల్లర్లు ముడి బియ్యాన్ని వెంటనే సరఫరా చేయాలని సూచించారు. సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రబీ 2024-25 సీజన్‌కు సంబంధించిన సిఎంఆర్‌ను ఈ నెల 31వ తేదీలోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మిగిలిన సిఎంఆర్‌ను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేయాలన్నారు. అలాగే ఖరీఫ్, రబీ 2025-26 సీజన్లకు సంబంధించిన సిఎంఆర్‌ను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం సేకరణ, మిల్లింగ్, బియ్యం సరఫరా ప్రక్రియలను సమన్వయంతో నిర్వహిస్తూ ఎలాంటి పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎ.సి.ఎస్.ఓ., రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకు ఐక్య ఉద్యమం






## 12వ జేబీసీసీఐ ఏర్పాటు చేయాలి..

### రాష్ట్ర బకాయిలు వెంటనే చెల్లించాలి

**మంచిర్యాల, 25, ఆగస్టు (ప్రజా జ్యోతి):** సింగరేణి సంస్థ పరిరక్షణతో పాటు 12వ జేబీసీసీఐ వేతన సవరణ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.50 వేల కోట్లకు పైగా బకాయిలను తక్షణమే చెల్లించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్--బీఎంఎస్) డిమాండ్ చేసింది. సింగరేణిలో వాటాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని, సంస్థ వార్షిక లాభాల్లో కార్మికులకు సముచిత వాటా, బోనస్ తదితర ఆర్థిక ప్రయోజనాలు అందించాలని కోరింది.కొత్తగూడెంలోని కేఓఏ క్లబ్‌లో మంగళవారం ఏబీకేఎంఎస్--బీఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి పరిరక్షణ, 12వ జేబీసీసీఐ వేతన సవరణ కమిటీ సాధన సదస్సు నిర్వహించారు. యూనియన్ ఉపాధ్యక్షుడు ఏ. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సదస్సుకు తెలంగాణ రాష్ట్ర బీఎంఎస్ సంఘటన కార్యదర్శి రామ్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థను పరిరక్షించు కోవడం ప్రతి కార్మికుడి బాధ్యత అని రామ్ మోహన్ అన్నారు. సంస్థ ప్రయోజనాలు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జెండాలకు అతీతంగా ఐక్య ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణిలో వాటాల పునర్వ్యవస్థీకరణ చేపట్టడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు చెల్లించాల్సిన రూ.50 వేల కోట్లకు పైగా బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంస్థకు రావాల్సిన నిధులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు సింగరేణి ఆదాయాన్ని సంస్థ అభివృద్ధికే వినియోగించాలని కోరారు. వార్షిక లాభాలను పారదర్శకంగా ప్రకటించి కార్మికులకు లాభాల వాటా, బోనస్ తదితర ప్రయోజనాల ను సముచితంగా అందించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన భారీ బకాయిల కారణంగా సింగరేణిపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక ఒత్తిడిని సాకుగా చూపి కార్మికులు, వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాలను తగ్గించడం లేదా పరిమితం చేయడం సరికాదన్నారు. కార్మిక సంక్షేమాన్ని కాపాడుతూనే సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని కోరారు. దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి వాటా సుమారు 9 శాతం మాత్రమే ఉన్నప్పటికీ సంస్థపై రూ.50 వేల కోట్లకు పైగా బకాయిల భారం ఉండటం ఆందోళనకరమన్నారు. సంస్థకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేసి ఆర్థికంగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నిలిపివేయాలని రామ్ మోహన్ డిమాండ్ చేశారు. అధిక రాజకీయ జోక్యం సంస్థ క్రమశిక్షణ, స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. సంస్థ అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి పెంపు, కార్మికుల భవిష్యత్తు కంటే కాంట్రాక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. రెగ్యులర్ కార్మికుల భవిష్యత్తును బలహీనపరిచే విధంగా కాంట్రాక్టు విధానాన్ని విస్తరించడం వల్ల ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన బొగ్గు గనులను ఎండీఓ విధానం ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి యాజమాన్యమే గనులను నిర్వహించాలని డిమాండ్ చేశారు.సింగరేణిలో వాటాల పునర్వ్యవస్థీకరణ జరిగినా కార్మికులకు ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు, లాభాల వాటా, బోనస్ వంటి ప్రయోజనాలకు నష్టం జరగదని రామ్ మోహన్ స్పష్టం చేశారు. కోల్ ఇండియా తరహాలో క్యాడర్ స్కీములు ప్రమోషన్లు, ఉద్యోగ ప్రగతికి మెరుగైన అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు.దేశవ్యాప్తంగా 12వ జేబీసీసీఐ వేతన సవరణ కమిటీ ఏర్పాటు కోసం బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు, సదస్సులు నిర్వహిస్తున్నామని ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్ తెలిపారు. 11వ వేతన ఒప్పందానికి సంబంధించి సీఐఎంఓఏఐ కోర్టులో దాఖలు చేసిన కేసును అనంతరం ఉపసంహరించుకోవడంతో 12వ జేబీసీసీఐ ఏర్పాటుకు మార్గం సుగమమవుతోందన్నారు. లేబర్ కోడ్ల కారణంగానే జేబీసీసీఐ ఏర్పాటు కావడం లేదంటూ కొన్ని కార్మిక సంఘాలు చేస్తున్న ప్రచారాన్ని కార్మికులు నమ్మాల్సిన అవసరం లేదన్నారు. 12వ జేబీసీసీఐని వెంటనే ఏర్పాటు చేసి మెరుగైన వేతన ఒప్పందం సాధించే వరకు బీఎంఎస్ కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతుందని హామీ ఇచ్చారు. సింగరేణి జేబీసీసీఐ నుంచి బయటకు రావాలని రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని, దీనిని కార్మికులు ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.సింగరేణి ఎస్సీ/ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆంటోటి నాగేశ్వరరావు, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, బీసీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కేవీ ప్రకాష్, ఓసీ అసోసియేషన్ అధ్యక్షుడు సోమిరెడ్డి తదితరులు ప్రసంగిస్తూ సదస్సులో ప్రస్తావించిన డిమాండ్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు, మెరుగైన వేతనాలు, సంస్థ ఆర్థిక పరిరక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి నష్టపోతే దాని ప్రభావం కార్మికులు, వారి కుటుంబాలపైనే పడుతుందని పేర్కొన్నారు.సింగరేణి పరిరక్షణను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా దీర్ఘకాలిక ఉద్యమంగా కొనసాగించాలని సదస్సు నిర్ణయించింది. వాటాల పునర్వ్యవస్థీకరణ, రాష్ట్ర ప్రభుత్వ బకాయిల చెల్లింపు, 12వ జేబీసీసీఐ ఏర్పాటు, కార్మికులకు లాభాల వాటా, రాజకీయ జోక్యం నిలిపివేత, కాంట్రాక్టీకరణ నియంత్రణ, సంస్థ స్వయం ప్రతిపత్తి పరిరక్షణ వంటి అంశాలపై భవిష్యత్‌లో మరింత విస్తృత ఉద్యమ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. కార్యక్రమాన్ని యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జీవీ కృష్ణారెడ్డి నిర్వహించగా, ఆర్గనైజింగ్ సెక్రెటరీ టీఎస్ పవన్ కుమార్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం రీజియన్ నాయకులు రామ్ సింగ్, మొగిలిపాక రవి, బి. కిషన్, సైదులు, లీలా కృష్ణ, నాగ ప్రసాద్, శైలేష్, కిరణ్, అఖిల్ తదితరులతో పాటు అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల ఫిట్ సెక్రటరీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలి

**పర్యావరణ సమతుల్యత అందరి బాధ్యత**

**'వన మహోత్సవం'లో జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్ ఆగష్టు 25 ప్రజా జ్యోతి** భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణంలో 'వన మహోత్సవం-2026' నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితిక పంత్, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, జిల్లా అటవీ అధికారి బాలమణిలతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని, జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, అటవీ శాఖ అధికారులు, పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# బోనాఫైడ్ కోసం విద్యార్థి అవస్థలు

**పాత పాఠశాల మూసివేతతో ఇబ్బందులు..**

**ప్రస్తుత పాఠశాల నుంచి స్పష్టత కరవు**

**ఆసిఫాబాద్, ఆగస్టు 25 (ప్రజాజ్యోతి):** చదువుకున్న పాఠశాల నుంచి బోనాఫైడ్ సర్టిఫికెట్ పొందేందుకు ఓ విద్యార్థిని ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. విద్యార్థి ఒకటో తరగతిని ఆసిఫాబాద్‌లోని రెవతి పాఠశాలలో చదువుకున్నారు. అయితే అప్పట్లో బోనాఫైడ్ సర్టిఫికెట్ తీసుకోకపోవడంతో ప్రస్తుతం అవసరం ఏర్పడిన సమయంలో సమస్య ఎదురైంది. అనంతరం రెండో, మూడో తరగతులను ఆసిఫాబాద్‌లోని వాసవి పాఠశాలలో చదువుకున్నట్లు విద్యార్థిని తెలిపాడు. ఆ సమయంలో కూడా బోనాఫైడ్ తీసుకోలేదని పేర్కొన్నాడు. ప్రస్తుతం బోనాఫైడ్ అవసరం కావడంతో పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదిస్తున్నా స్పష్టమైన సమాచారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవతి పాఠశాల ప్రస్తుతం లేకపోవడంతో అక్కడి పాత విద్యార్థుల విద్యా రికార్డులు ఎక్కడ ఉన్నాయనే ప్రశ్న తలెత్తుతోంది. మరోవైపు వాసవి పాఠశాలలో చదివిన రికార్డుల ఆధారంగా బోనాఫైడ్ జారీ చేసే అవకాశం ఉన్నప్పటికీ, సంబంధిత ప్రక్రియపై విద్యార్థికి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. పాత విద్యా




రికార్డులను పరిశీలించి బోనాఫైడ్ పొందేందుకు మార్గం చూపాలని విద్యార్థిని కోరుతున్నారు. అవసరమైతే సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నాడు. మరింత సమాచారం తెలియాల్సి ఉంది. వెలుగులోకి రావాల్సిన సమాచారం రావాల్సి ఉంది!.

# విద్యార్థులపై బిజెపి నాయ కులది కపట ప్రేమ

## ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 25, (ప్రజా జ్యోతి )** తెలంగాణ రాష్ట్రంలో బిజె పి నాయకులు విద్యార్థులపై కపట ప్రేమను చూపిస్తున్నారని ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి తోట కపిల్ ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ బిజెపి నాయకులకు ఈమధ్య విద్యార్థులపై ఎనలేని ప్రేమ పుట్టుకొచ్చిందని ఎద్దేవా చేశారు. ఒకవై పు ఢిల్లీలో నేటి విద్యార్థుల పైబ్బర్ బుల్లెట్ ల వర్షం కురిపిస్తూ విద్యార్థులపై అక్రమంగా ఎఫ్ ఐ ఆర్ అక్రమ కేసులు నమోదులు చేస్తూ ఈ రాష్ట్రంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్షిప్పులు ఇవ్వట్లేదు అని దొంగ నిరాహా ర దీక్షలు చేస్తున్నారని విమర్శించారు. 2021-నుండి 20 23 డిసెంబర్ 7 వరకు టి ఆర్ ఎస్ ప్రభుత్వం విద్యార్థు లకు ఇవ్వాల్సిన స్కాలర్ షిప్పుల 5000 వేల కోట్లు అప్పు ఉన్నప్పుడు తెలంగాణ బిజెపి నేతలకు అడగ డాని కి మాటలు రాలేదని, దీంతో బిఆర్ఎస్, బిజెపి జాన్ జబ్బా దోస్తు పార్టీలు అని స్పష్ట మవుతోందని అన్నారు. తెలంగాణలో ఉన్న ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం విజనరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని మధ్యాహ్న భోజనంలో పోషకాహారం, సన్న బియ్యం పథకం, అనేక అభివృద్ధి కా ర్యక్రమాలు చేపడుతూనే 24 వస్తువులతో కూడిన యంగ్ ఇండియా ఎడ్యుకే




షనల్ కిట్ పంపిణీ చేస్తూ ఆదర్శవంతమైన విద్యావ్యవస్థని తెలంగాణలో పునరు ద్ధరిస్తుంటే ఓర్వలేని బిజెపి, బిఆర్ఎస్ నేతలు వీటిపై బురదజల్లే ప్రయత్నాలు చే స్తున్నారని, ఇవి విద్యార్థుల కు నవ్వులు పుట్టిస్తున్నా ఒకవైపు దేశవ్యాప్తంగా జంజీలు బిజెపిపై దండయాత్ర చే స్తుంటే ఆమరకని తుడు చుకోవడానికి తెలంగాణలో విద్యార్థులు మా వైపు వస్తారేమోనని, ఈ భరోసాలేని నిరాహార దీక్షలు చేస్తున్నారని, మీకు నిజంగా విద్యార్థు లపై చిత్తశుద్ధి ఉంటే నీట్ వి ద్యార్థులకు న్యాయం చేసి అప్పుడు తెలంగాణ విద్యా ర్థుల గురించి మాట్లాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకు లు,జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ కళ్యాణ్, అదిలాబాద్ జిల్లా మీడియా కోఆర్డి నేటర్ మేకల జితేందర్,లింగం పల్లి నరసింహులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# నిర్మల్ టీఎన్జీవో భవన్లో జానపద దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పలువురు కళాకారులు

**సారంగాపూర్, ఆగస్టు 25, ప్రజా జ్యోతి** ప్రపంచ జానపద దినోత్సవ వేడుకల్లో భాగంగా జానపద కళారంగంలో తనదైన ప్రతిభతో ప్రేక్షకులను అలరిస్తున్న దరువు భోజన్న, సింగర్ దినేష్ ప్రతిభను గుర్తించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు లభించిన సన్మానం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. జానపద కళా సంప్రదాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ధనరాజ్ మాస్టర్, మహిపాల్, సురేష్, స్వామీ, జోసెఫ్ బాపూరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు రాజేశ్వర్, అష్ట దిగంబర్, గొల్లమాడ లక్ష్మణ్, పంభాల రమేష్, డోలాక్ సాయిరాం, మమత సతీష్, గోపి, అమ్మ సా




యి, జీవాన్ మాస్టర్, వినయ్, తదితరులు అభినందనలు తెలిపారు.

## వావుదంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఆసిఫాబాద్ ఆగష్టు 25 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలం వావుదం గ్రామ పంచాయతీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. గ్రామ సర్పంచ్ కోరేంగ జుగాదిరావు సమక్షంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (విఆర్ ఓ ) శంకర్, గ్రామ పటేల్ శాలిక్ రావు, వార్డు సభ్యులు కలిసి లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోరేంగ జుగాదిరావు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ చేరవేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, నాయకులు కోరేంగ యశ్వంత్ రావు, జాలింశా, యదోషావ్, మాన్కు, ఆనంద్ రావు, తిరుపతి, చందు, శేకు, లక్ష్మణ్, ద్రౌపది బాయి, గిరిజాబాయి, రాధా బాయి, అంగన్‌వాడీ కార్యకర్త సంపతుబాయి, రేషన్ డీలర్ భీమ్‌రావ్, గణపతి, బహదూర్ షా, అక్బర్ షాతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిల్లల భవిష్యత్తే మా బాధ్యత ఆలోచనతో భవిష్యత్తు ఉజ్వల ముగా ఉండాలని విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ

**సాయంత్రం 3:30 గంటలకు ముగించాల్సిన పాఠశాల విద్యార్థులకు చదువు బాగా రావాలని 5 గంటల వరకు ప్రతేక్య బోధన చేస్తున్న,హెడ్మాస్టర్ లింగారెడ్డి**

**వెంకట్రావుపేట్ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలతో హృదయపూర్వక ధన్యవాదములు అన్నారు:**



**ఆగస్టు25,సిర్పూర్(టి) కానిస్టేన్సి కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని వెంకట్రావుపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్య బోధన చేస్తున్న హెడ్మాస్టర్ లింగారెడ్డి నాలుగో తరగతి నుండి 5వ తరగతి గల విద్యార్థులకు చదువు బాగా రావాలని సదుద్దేశంతో ప్రత్యేక విద్యా బోధన శ్రీకారం చుట్టారు. పిల్లల భవిష్యత్తు నా బాధ్యత అనే మంచి ఆలోచనలతో విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలముగా ఉండాలని వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక విద్య బోధన చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సాయంత్రం 3:30 గంటల వరకు మాత్రమే తరగతులు నిర్వహించాల్సి ఉండగా విద్యార్థులకు చదువు బాగా రావాలని సదుద్దేశంతో వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ సాయంత్రం 5:00 గంటల వరకు అధినంగా విద్య బోధన చేస్తున్నారు. విద్యార్థుల చదువుపై ఇంతటి శ్రద్ధ చూపిస్తూ పాఠశాల సమయం ముగిసిన తరువాత కూడా విద్యార్థులకు చదువు చెప్పడం నిజంగా అభినందనీయమని వెంకట్రావుపేట్ గ్రామ విద్యార్థుల తల్లిదండ్రుల తరఫున హృదయ పూర్వక అభినందనలు తెలుపుతూ! భవిష్యత్తే మా బాధ్యత అనే ఆలోచనలతో సేవ చేస్తున్న హెడ్మాస్టర్ లింగ రెడ్డి కు ప్రత్యేక కృతజ్ఞతలతో ధన్యవాదములు తెలియజేశారు.

# చీటింగ్, దొంగతనం, అటెన్షన్ డైవర్షన్ కేసులో నిందితుడి అరెస్ట్

**ఫోన్‌పే ద్వారా రూ.17 వేల నగదు బదిలీ చేసిన నిందితుడు**

**నిందితుడిపై గతంలో 8 కేసులు నమోదు**

**రూ.10 వేల నగదు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం**

**ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి**




**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 25, (ప్రజా జ్యోతి )** ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ లో ఆటో డ్రైవర్‌ను మాట ల్లో పెట్టి, అతని మొబైల్ ఫో న్‌ను తీసుకుని ఫోన్ పే ద్వారా రూ.17,000/- నగదును తన ఖాతాకు బదిలీ చేసు కుని మోసానికి పాల్పడిన నిందితుడిని టూ టౌన్ పోలీ సులు అరెస్ట్ చేశారు. ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్‌లోని బొక్క ల గూడకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ హాది ఈ నెల 21న ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో నడుపుతుండగా, ఓ మహిళ, ఆమె కుమారుడు ఖండాల గ్రామానికి వె ళ్లేందుకు ఆటోను అద్దెకు తీసుకున్నారు. మహిళను ఖం డాల వద్ద దించిన అనంతరం ఆమెతో వచ్చిన వ్యక్తి మరో ప్రాంతానికి వెళ్లాలని కోరగా, ఆటో డ్రైవర్ రూ.2, 000/- ఛార్జీగా చెప్పడంతో అతను అంగీకరించాడు.ఆదిలాబాద్ క్రాస్‌రోడ్స్ వద్దకు చేరుకున్న సమయం లో తన ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందంటూ ఆటోడ్రైవర్ మొబైల్ ఫోన్‌ను తీసుకుని ఫోన్ చేసినట్లు నటించాడు. అనంతరం నిందితుడు ఆటో డ్రైవర్‌కు తెలియకుండా అతని ఫోన్‌లోని ఫోన్‌పే ద్వారా రూ.17,000/- తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. మరుసటి రోజు ఫోన్‌పే లావాదేవీలను పరిశీలించిన ఆటో డ్రైవర్ విషయం గుర్తించి సైబర్ క్రైమ్ హెల్ప్ లై న్‌కు ఫిర్యాదు చేశాడు. ఫి ర్యాదు మేరకు టూ టౌన్ పో లీసులు క్రైమ్ నంబర్ 57 6/2026, సెక్షన్ 318(4), 303(2) దీచీూ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. దర్యాప్తులో నిందితు డిని రాథోడ్ యువరాజ్ (26) దత్త, నివాసం: చిచ్‌ధరి ఖానాపూర్ గ్రామం, ఆదిలాబాద్ రూరల్ మండ లంగా గుర్తించి అరెస్ట్ చేశారు.నిందితుడి వద్ద నుంచి రూ.10,000/- నగదు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చే సుకున్నారు. నిందితుడిపై గ తంలో కూడా 8 కేసులు న మోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించ డంలో కీలకంగా వ్యవహరించిన టూ టౌన్ పోలీసు లను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలోటూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, ఎస్ఐలు అఖిల్, ప్రణయ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్పి ఎంఆర్పిఎస్ నూతన మండల కమిటీల ఎన్నిక

**హోళగుంద :** మండల కేంద్రంలో మంగళవారం ఎంఎస్పి ఎంఆర్పిఎస్ నూతన మండల కమిటీని ఏకగ్రీవం ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా ఎంఎస్పి ఎంఆర్పిఎస్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు,హోళగుంద మండల ఇంచార్జ్ ఆస్పరి పెద్ద సంజప్ప హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి,పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ దేశంలో ఏ కుల సంఘానికి దక్కని గౌరవాన్ని మాదిగలతో పాటు అణగారిన వర్గాలకు తీసుకువచ్చారని అన్నారు.1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ప్రారంభమైన ఎంఆర్పిఎస్ ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు విస్తరించి సామాజిక న్యాయం కోసం పోరాడుతోందన్నారు.తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వికలాంగుల సంక్షేమం, ఆరోగ్యశ్రీ,నిరుపేదలకు బియ్యం,ఎస్సీ,ఎస్టీ,బీసీ ఉద్యోగ ప్రమోషన్లు,వివిధ సంక్షేమ పథకాల కోసం జరిగిన పోరాటాల్లో మందకృష్ణ మాదిగ కృషి కీలకమని పేర్కొన్నారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్,మహాత్మా జ్యోతిరావు పూలే,కాన్షీరాం ఆశయాల సాధన కోసం మాదిగలు,ఉపకులాలు,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల ప్రజలు మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.అనంతరం ఎంఎస్పి నూతన మండల కమిటీ మండల అధ్యక్షుడిగా చిన్నహ్యాట దేవప్ప రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మండల అధికార ప్రతినిధిగా నాగరకన్వి వెంకటేష్ మాదిగ ఏకగ్రీవం ఎన్నుకున్నారు.మరియు ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడిగా రెండోసారి ఎస్. కెంచప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మండల అధికార ప్రతినిధిగా తప్పెట మల్లికార్జున మాదిగ ఏకగ్రీవం ఎన్నుకున్నారు.అదేవిధంగా ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు హెబ్బటం పక్కీరప్ప,జిల్లా సీనియర్ నాయకులు బి. మల్లికార్జున,ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు పంచగుండిగ వెంకటేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్,

## ఆళ్ళగడ్డ హైవే దగ్గర బస్సు బోల్తా, 10 మందికి గాయాలు

**ఆళ్లగడ్డ :** మంగళవారం ఆళ్లగడ్డ నుండి ప్రొద్దటూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు ఆళ్లగడ్డ హైవే కింద ఉన్న సర్వీస్ రోడ్డు వద్ద అదుపుతప్పి పక్కకు ఒరిగింది , దీంతో ఒక్కసారిగా బస్సులో ఉన్నవారంతా బయందోళన చెందారు. పక్కనున్న వారంతా కలిసి కలిసి బస్సులో ఉన్న వారిని క్షేమంగా బయటికి తీసుకొచ్చారు ?గాయపడ్డా వారిని అంబులెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించారు.

## ప్రజా విశ్వాసమే సమర్థవంతమైన పోలీసింగ్‌కు పునాది

**క్షేత్రస్థాయిలో పోలీసింగ్ బలోపేతమే లక్ష్యం: ఎస్పీ డా. శబరీష్,**

**మహబూబాబాద్ జిల్లా.** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని కిట్‌లను, రికార్డులను, వివిధ గదులను, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రిసెప్షన్‌ను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలు, స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు.స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క సిబ్బందితో ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి విధి నిర్వహణ, ఎదురవుతున్న డ్యూటీ సంబంధిత సమస్యలు, వ్యక్తిగత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తనతో స్వేచ్ఛగా పంచుకోవచ్చని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిబ్బందికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, క్రమం తప్పకుండా రొటీన్ హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ముఖ్యమైన రికార్డులు, అఆ ఈతిశ్రీవబ (అజీబవ ఆతిజీతీతివబ), దర్యాప్తు పత్రాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తు పురోగతి, కేసుల పెండెన్సీ, రికార్డుల నిర్వహణ, అఆబొలో వివరాల నమోదు, అప్‌డేషన్ తదితర అంశాలను

# 7 నుంచి అసెంబ్లీ

**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల సమయంలో ఈ సమావేశాలు నిర్వహించనుండటం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. తొలి రోజు సమావేశం అనంతరం స్పీకర్ నేతృత్వంలో జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ భేటీలో ఉభయ సభలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ ప్రభుత్వం పలు కీలక బిల్లులు, విధానపరమైన నిర్ణయాలను సభ ముందు ఉంచే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు, ప్రజా సమస్యలు, హామీల అమలు, భూముల వివాదంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసేందుకు బీఆర్ఎస్, బీజేపీ పక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్న రిజిస్ట్రేషన్ల చట్టంలోని వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరుగుతుందా అని ఆసక్తి నెలకొంది. రైతులకు ప్రాజెక్టుల నుంచి సాగునీటిని సకాలంలో విడుదల చేయకపోవడం, కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేసినవి ఆరోపణలేనని నిలదీసేందుకు కేటీఆర్, హరీష్ రావు టీం ప్లాన్ చేయనుంది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, పాలిటెక్నిక్ కాలేజీల సమస్యలు, సభలో నిలదీసేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల విదేశాలకు వెళ్లగా యూకే పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, అమెరికా పర్యటనకు మాత్రం కొర్రీలు పెట్టడాన్ని తప్పుపట్టారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. విద్య, క్రీడా రంగాలకు సంబంధించి పెట్టుబడులు, అంతర్జాతీయ సహకారం ఆకర్షించడమే లక్ష్యంగా విదేశీ పర్యటన కోసం విదేశాంగ శాఖకు ముందే పూర్తి వివరాలు సమర్పించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చినప్పటికీ, దురదృష్టవశాత్తూ అమెరికా పర్యటనకు మాత్రం నిరాకరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుజరాత్ సీఎంకు విదేశీ పర్యటనలు, రోడ్ షోలకు సులభంగా అనుమతులు ఇచ్చి, తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. "కేంద్రం భౌతికంగా నన్ను అడ్డుకోగలదు, కానీ నా ఆలోచనలను, తెలంగాణ అభివృద్ధి ఆకాంక్షలను కాదనలేదు" అని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం తన వ్యక్తిగత అవమానం కాదని, 4 కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమని పేర్కొన్నారు. కేంద్ర వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు పలువురు సీనియర్ నేతలు తీవ్రంగా ఖండించారని గుర్తుచేశారు.రైజింగ్ తెలంగాణ 2047 ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా పెట్టుకుంటే, కేంద్రంలోని బీజేపీ నేతలు విచక్షణ మరిచిపోయి ఈ అధికారిక పర్యటనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ విభేదాలు ఎలా ఉన్నా, రెండు ప్రభుత్వాలు మరియు ప్రజాప్రతినిధుల మధ్య ఫెడరల్ సత్సంబంధాలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## ప్రజా విశ్వాసమే సమర్థవంతమైన పోలీసింగ్‌కు పునాది..

**క్షేత్రస్థాయిలో పోలీసింగ్ బలోపేతమే లక్ష్యం:**

**ఎస్పీ డా. శబరీష్,**

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని కిట్‌లను, రికార్డులను, వివిధ గదులను, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రిసెప్షన్‌ను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలు, స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు.స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క సిబ్బందితో ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి విధి నిర్వహణ, ఎదురవుతున్న డ్యూటీ సంబంధిత సమస్యలు, వ్యక్తిగత సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తనతో స్వేచ్ఛగా పంచుకోవచ్చని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిబ్బందికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు.